ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు
7
ఆదివారం 28 సెప్టెంబరు 2025

ఏపీ ఎడ్‌సెట్ చివరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల
8లో..

విద్యార్థిని మృతి కేసును సీబీఐకి అప్పగించండి
● గుంటూరు ఎస్పీకి హైకోర్టు ఆదేశం

సాగర్‌లో 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల
10లో..

స్థానిక సంస్థలకు.. మొండిచేయి!

ఏడాదిగా జమ కాని స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి

- మూడు జిల్లాల్లో రూ.100 కోట్లకు పైగా దస్తావేజు రుసుం బకాయి
- ప్రభుత్వం ఆదేశిస్తేనే ఖాజానాకు ప్రొసీడింగ్స్
- నిధుల లేమితో కునారిల్లుతున్న పురాలు, పంచాయతీలు



ప్రభుత్వం స్థానిక సంస్థలకు మొండిచేయి చూపుతోంది. ఏడాదిగా స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి మునిసిపాలిటీలు.. పంచాయతీలకు జమ కాలేదు. దీంతో నిధుల లేమితో స్థానిక పాలన కునారిల్లుతోంది. కొన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. పారిశుధ్య పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి విడుదల చేయాలని స్థానిక సంస్థల పాలక వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నా వాటి మొర ఆలకించే పరిస్థితి కనిపించడం లేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సర్‌చార్జి బకాయి రూ.100 కోట్లకు పైగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

(చీరాల, ఆంధ్రజ్యోతి)

మునిసిపాలిటీలు, పంచాయతీలు, మండల, జడ్పీ ఖాతాలకు సర్‌చార్జి నిధులు 2024 జూలై నుంచి జమ కావడం లేదు. ఈ నిధులన్నీ ప్రభుత్వమే వాడేసింది. స్టాంపు డ్యూటీ సర్‌చార్జి నిధులు ప్రతి నెలా ప్రభుత్వ ఖజానా ద్వారా స్థానిక సంస్థలకు జమవుతాయి. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్థానిక సంస్థల వారీగా ప్రొసీడింగ్స్ ఖజానాకు పంపిస్తారు. ఖజానా శాఖ అధికారులు మునిసిపాలిటీలు, పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఖాతాలకు నిష్పత్తి ప్రకారం నిధులు జమ చేస్తారు. పంచాయతీ పరిధిలో జరిగే ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 1.5 శాతం సర్‌చార్జి మూడు భాగాలుగా విభజిస్తారు. ఇందులో మూడో వంతు పంచాయతీలకు.. ఒక వంతు చొప్పున జడ్పీ, మండల



చీరాల రిజిస్ట్రార్ కార్యాలయం

> మునిసిపాలిటీ, పంచాయతీ పరిధిలోని ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు, పొలాల క్రయ విక్రయాలు జరిగితే స్టాంపు డ్యూటీ సర్ చార్జీని స్థానిక సంస్థల ఖాతాలకు జమ చేయాలి. ఒక స్థిరాస్తి కోటి రూపాయలకు విక్రయం జరిగితే అందులో 1.5 శాతం అంటే రూ.1.5 లక్షలు సంబంధిత పంచాయతీ లేదా మునిసిపాలిటీ ఖాతాకు జమ చేయాలి. పంచాయతీ పరిధిలో జరిగే ఆస్తుల విక్రయాలకు సంబంధించి నిష్పత్తి ప్రకారం పంచాయతీతో పాటు మండల, జిల్లా పరిషత్తుల ఖాతాలకు సర్‌చార్జిలు జమ చేయాలి. విక్రయించిన ఆస్తి తాలూకా పేర్ల మార్పులు స్థానిక సంస్థలు చేయాలి. చట్ట ప్రకారం ప్రతి రిజిస్ట్రేషన్‌కు కచ్చితంగా నిర్ణయించిన శాతం సర్‌చార్జి స్థానిక సంస్థలకు జమ కావాల్సిందే.

(మిగతా 8వ పేజీలో)

అద్భుతంగా.. ఆర్టీసీ

- కాలుష్య రహిత రవాణాపై కసరత్తు
- నవనగరాల్లో తొమ్మిది బస్‌స్టేషన్లు, డిపోలు
- అమరావతి శివార్లలో మూడు భారీ టెర్మినల్స్
- 165 ఎకరాలు కేటాయించాలని సీఆర్డీఏకి వినతి



సిటీ బస్‌స్టాప్ (ఊహాచిత్రం)

అత్యాధునికంగా.. ఆహ్లాదకరంగా.. కాలుష్య రహితంగా.. ప్రపంచ రాజధానిగా రూపొందుతోన్న అమరావతికి ఏ మాత్రం తీసిపోనట్లుగా.. రాజధానిలో బస్‌స్టేషన్లు, డిపోలు, టెర్మినల్స్ నిర్మాణానికి ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు అమరావతిలో అవసరమైన భూములకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ఏపీసీఆర్డీఏకు ఆర్టీసీ అధికారులు వినతి పత్రం అందజేశారు. ఒకవైపు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయాన్ని తలదన్నేలా విమానాశ్రయం, పెదపరిమి-నెక్కల్లు మధ్య 15 వందల ఎకరాల్లో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఆర్టీసీ కూడా ముందుకు వచ్చింది. అమరావతి 2.0లో రాజధానిలో వివిధ సంస్థలు భారీగా నిర్మాణాలు చేపడుతుండగా.. ఆర్టీసీ కూడా రాజధానిలో భావి రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూముల కేటాయింపుపై సీఆర్‌డీఏను ప్రత్యేకంగా కోరింది.

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

ఎన్నో విశిష్టతలు.. మరెన్నో రకాల ప్రత్యేకతలతో యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకునేలా రూపుదాలుస్తున్న రాజధాని అమరావతిలో రవాణా సదుపాయాలు ఏవిధంగా ఉంటాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. అన్ని రకాల రవాణా సౌకర్యాలను ప్రయాణికులకు.. ఆహ్లాదకరమైన అనుభూతులను పంచేలా ప్రయాణికులను ఫైమరిపించేలా సదుపాయాలను వినూత్నంగా విభిన్నంగా ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇందుకోసం అమరావతిలో అద్భుతమైన రోడ్‌గ్రిడ్‌ను రూ.వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. నగరానికి వాయు, రైలు, రోడ్డు కనెక్టివిటీలను విస్తృతంగా పెంచడంతోపాటు జల రవాణా సదుపాయాలను కల్పించి ప్రయాణికులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవాలని భావిస్తుంది. ప్రస్తుతం అమరావతి నిర్మాణపనులు ఊపందుకోవడంతోపాటు భూములను పొందిన కొన్ని సంస్థలు (మిగతా 8వ పేజీలో)

బస్ టెర్మినల్ (ఊహాచిత్రం)



కలెక్టర్‌కు.. పర్యాటక అవార్డు

సీఎం చంద్రబాబు నుంచి అందుకున్న వినోద్‌కుమార్



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పర్యాటక రంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరిస్తూ బెస్ట్ కంటెంట్‌తో కాఫీటేబుల్ బుక్‌ను అందు బాటులోకి తెచ్చినందుకు కలెక్టర్ వినోద్‌కుమార్ అవార్డు దక్కించుకున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా శని వారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి బాపట్ల కలెక్టర్ పర్యాటక అవార్డు అందుకున్నారు. ఇటీవలే ఇక్కడ బాధ్యతలు చేపట్టిన వినోద్‌కుమార్ అంతకముందు అనంతపురం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. అక్కడ సేవలందిస్తున్న సమయంలోనే పర్యాటకంపై కాఫీటేబుల్ బుక్‌ను సిద్ధం చేసి ప్రభుత్వం చేసే కార్యక్రమాలకు ఊతం అందించారు. ఆ సేవలకు గుర్తింపుగా వినోద్‌కుమార్‌ను పర్యాటక దినోత్సవం రోజున ప్రభుత్వం అవార్డుతో సత్కరించింది.

తల్లి హత్య కేసులో తనయుడి అరెస్టు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగదు ఇవ్వలేదని మద్యం మత్తులో తల్లిని హత్య చేసిన కేసులో బాపట్ల మండలం పూండ్ల గ్రామానికి చెందిన జాలయ్యను అరెస్టు చేసినట్లు డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో శనివారం నిందితుడ్ని మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. పూండ్ల గ్రామానికి చెందిన పి.రమణమ్మ గ్రామంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. ఆమె కుమారుడు డబ్బులను అడగ్గా ఇవ్వలేదు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న కుమారుడు ఇనుపరోడ్డుతో ఆమె తలపై కొట్టడంతో మృతి చెందింది. దీంతో కుమారుడు పారిపోయాడు. మృతురాలి భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో జాలయ్యను చుండూరుపల్లి గ్రామంలో శనివారం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడ్ని అరెస్టు చేసిన రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

అదుపుతప్పిన ట్రాక్టర్.. ఇద్దరి మృతి

- రోడ్డుపై ఉన్న ఓ వ్యక్తికి తీవ్రగాయాలు

అద్దంకి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్లేందుకు ఎక్కిన ట్రాక్టరే వారి ప్రాణాలను తీసింది. ట్రాక్టర్ అదుపుతప్పగా రోడ్డుపై పని చేసుకుంటున్న ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనతో మండలంలోని తిమ్మాయపాలెంలో విషాదం అలుముకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. తిమ్మాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన వేము నర్సమ్మ (60), కొప్పుల స్వరూపరాణి(47) మరో ఇద్దరు మహిళా కూలీలు ముండ్లమూరు మండలం పోలవరానికి పనులకు వెళ్లేందుకు శనివారం ఉదయం రోడ్డుపై ఉన్నారు. అదే సమయంలో ఇటుకల లోడుతో అటువైపు వెళ్తున్న ఓ ట్రాక్టర్ ఎక్కారు. నలుగురు కూలీలు ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చొన్నారు. సుమారు 100 మీటర్ల దూరం వెళ్లే సరికి ట్రాక్టర్ అదుపు తప్పి మార్జిన్‌లో ఉన్న ఇసుక కుప్పపైకి ఎక్కింది. దీంతో ఇద్దరు మహిళా కూలీలు కిందపడగా వారి పై ట్రాక్టర్ ట్రాలీ దూసుకెళ్లింది. దీంతో నర్సమ్మ, స్వరూప రాణి అక్కడికక్కడే మృతి చెందారు. ఆ ప్రాంతంలో ఓ ఇంటి ముందు ఇంకుడుగుంత పనులు చేసుకుంటున్న తోకల శ్రీనివాసరావును ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ మద్యం మత్తులో ఉండి ట్రాక్టర్ నడపడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. మృతదేహాలను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.



నర్సమ్మ, స్వరూపరాణి (పాత చిత్రం)



రేపల్లె: 23వవార్డులో రాజరాజేశ్వరిదేవిగా దుర్గమ్మ

వైభవంగా దసరా ఉత్సవాలు


పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరో రోజు శనివారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బగళాముఖి అమ్మవారికి లక్ష్మీపూజ, లక్ష్మీహోమ కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. చెరుకుపల్లికి చెందిన నృత్యకారిణి భావన ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో భక్తులను అలరించారు. ఆయా కార్యక్రమాలను త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్య నిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో దసరా ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతుండగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

కృష్ణానదిలో పెరిగిన వరద

దిగువకు 3.84 లక్షల క్యూసెక్కుల విడుదల

కొల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో వరద ప్రవాహం గంటగంటకు పెరిగింది. శనివారం సాయంత్రం ఏడు గంటలకు ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 3,84,525 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు బ్యారేజీ అధికారులు ప్రకటించారు. ఆదివారం 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. దీంతో నదీ పరివాహక గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు.

అరవింద వారధి వద్ద పెరిగిన వరద ప్రవాహం



కలెక్టరేట్‌లో జీఎస్టీ 2.0 హెల్ప్‌డెస్క్

- సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలి
- పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జీఎస్టీ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాహనాలు, ఎలక్ట్రానిక్, మందులు, వస్త్రాలు, నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గింపు లభిస్తుందన్నారు. తగ్గే ధరలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌కు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఎస్పీ బి.ఉమామహేశ్వర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

జలవనరులశాఖ ద్వారా చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని జలవనరులశాఖ ద్వారా చేపడుతున్న వివిధ రకాల పనులకు సంబంధించి శనివారం కలెక్టరేట్‌లో ఆ శాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, భూగర్భజలాలు, పంచాయతీరాజ్‌శాఖలతో సమన్వయం చేసుకుని జలవనరుల శాఖ పనిచేయాలన్నారు. జిల్లాలో 716 రకాల పనులు చేపట్టడం జరుగుతుందని అందులో 148 పనులు పూర్తి చేయగా, 568 పనులు వివిధ దశలలో ఉన్నట్లు జిల్లా వాటర్ రీసోర్స్ అధికారి అబా అబుతలీమ్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఈఈలు మురళికృష్ణ, సుధాకర్, ప్రేమ్‌కుమార్, సతీష్, శివరాంప్రసాద్, డీఈలు మల్లికార్జునరావు, జాకీర్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్

అడవి విలపిస్తోంది

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తీర ప్రాంత రక్షణ ముప్పులో పడుతోంది. సముద్రతీరంలో మడ అడవుల విస్తీర్ణం పెరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా పరిస్థితులు నెలకొంటున్నాయి. మడ అడవులు రొయ్యల చెరువులుగా మారిపోయాయి. దీనికితోడు అటవీ భూముల్లో చెట్లు నరికివేసి ఆక్రమించేశారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌తో ఆ అటవీ భూములను రిజిస్ట్రేషన్ చేసినట్లు గతంలోనే ఫిర్యాదులు అందాయి. సూర్యలంక తీరంలో భూములకు ఉన్న డిమాండ్‌ను బట్టి అటవీ భూముల కైంకర్యం వెనుక గత ప్రభుత్వంలోని వైసీపీ పెద్దల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. బాపట్ల రూరల్ పరిధిలోని దాదాపు నాలుగు గ్రామాల పరిధిలో 48 ఎకరాల వరకు అటవీభూములను తమకు సాగుకు ఇచ్చినట్లు గత ప్రభుత్వంలోనే కొంతమంది రోడ్డెక్కారు. ఈ భూమికి సంబంధించి రెవెన్యూ, అటవీ విభాగాల మధ్య చిన్నపాటి వివాదం కూడా అప్పట్లో నడిచింది. విచారణ అనంతరం ఆ భూములు అటవీ విభాగం పరిధిలోకి వస్తాయని తేలాయి. అటవీ అధికారుల అంచనా ప్రకారమే దాదాపు 2,000 ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు అందులో రొయ్యల సాగవుతుందని అధికారులు గుర్తించారు. కనీస నిబంధనలు పాటించకుండా అభివృద్ధి పేరిట తీర ప్రాంత అటవీ భూముల విషయంలో జరుగుతున్న దందా అంతా ఇంతా కాదు. అటవీ భూముల పరిరక్షణ కోసం అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. ప్రైవేటు వ్యక్తులెవరూ ఆ భూముల్లోకి వెళ్లడానికి వీల్లేకుండా ఇటీవలే చర్యలు చేపట్టారు. జిల్లాలో దాదాపు 72 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతంలోని గ్రామాలకు రక్షణగా నిలిచే మడ అడవులను కాపాడుకోవడంతో పాటు అటవీ భూములను ఆక్రమణల చెరనుంచి విడిపించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



సూర్యలంక తీరంలోని అటవీ భూమి

గణాంకాలు కరువు

తీర ప్రాంతంలో ఉన్న అటవీ భూముల విస్తీర్ణంపై అధికారుల వద్దే కచ్చితత్వంతో కూడిన గణాంకాలు లేవు. సూర్యలంక తీరంలో ఉన్న పట్టా భూములే అతి స్వల్పం. వాటి రికార్డులు నిర్వహించడంలో అటు రెవెన్యూతో పాటు ఇటు అటవీ విభాగాల నిర్లక్ష్యం అడవి తల్లికి శాపంగా మారుతోంది.

సంస్థలు పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యే సంస్థలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం పర్యాటకశాఖ అధికారులు, హౌస్‌బోట్స్, క్రూయిజ్ అభివృద్ధి, హౌస్‌బోట్స్ బిల్డర్స్, ఆపరేటర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కృష్ణా నదీ తీరపు ప్రకృతి సౌందర్యం, సముద్ర తీరం, కృష్ణానది బ్యాక్‌వాటర్, మడ అడవులు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయని తెలిపారు. సూర్యలంక సముద్ర తీరం నుంచి నిజాంపట్నం వరకు క్రూయిజ్, హౌస్‌బోట్స్ కార్యకలాపాలకు అనువుగా ఉంటుందని చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదన అందజేస్తే తగిన సహకారం అందిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో సందర్శకులను ఆకర్షించేలా సూర్యలంక బీచ్‌కు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సూర్యలంక హౌస్‌బోట్స్ సర్వేలో పాల్గొనే వారి వివరాలను కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటకశాఖ జీఎం నాంచారయ్య, ఇతర రాష్ట్రాలకు చెందిన హౌస్‌బోట్స్ బిల్డర్‌లు, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ ఉన్నత పాఠశాల మూసివేతకు సిద్ధం

- రికార్డులు స్వాధీనం చేయాలని ఆర్జేడీ ఉత్తర్వులు
- డిప్యూటీ ఈవోకు బాధ్యతల అప్పగింత



లూథరన్ ఉన్నత పాఠశాల

యడ్లపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోనే తొలి ఉన్నత పాఠశాల.. లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మూసివేతకు చర్యలు ప్రారంభమయ్యాయి. నరసరావుపేట డిప్యూటీ ఈవో సుభాని శనివారం పాఠశాలకు చేరుకుని రికార్డులను స్వాధీనం చేయాలని హెచ్‌ఎంను కోరారు. దీంతో పాఠశాల సిబ్బంది రికార్డులను అప్పగించే పనిలో నిమగ్నమయ్యారు. ఏడు దశాబ్దాలకు పైగా విద్యాబుద్ధులు అందించిన పాఠశాల.. ఏఈఎల్‌సీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా మూత వేయడం ఈ ప్రాంత వాసులను కలచి వేసింది. విద్యాశాఖ ఆర్జేడీ ఆదేశాల మేరకు రికార్డులను స్వాధీనం చేసుకుంటున్నామని డిప్యూటీ ఈవో సుభాని తెలిపారు. స్వాధీన ప్రక్రియ మూడు నుంచి నాలుగు రోజులు పడుతుందన్నారు. రికార్డులను స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో భద్రపరచనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న హెచ్‌ఎం, ఇద్దరు ఎస్‌జీటీ లతోపాటు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్లను వేరొక చోటకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. వీరంతా జిల్లా విద్యాశాఖాధికారికి ఇప్పటికే రిపోర్టు చేశారని.. త్వరలోనే వీరిని మరోచోట సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు.

ఏపీని క్రీడలకు కేంద్రంగా మారుస్తాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

గుంటూరు (విద్య), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారించిందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని క్రీడలకు కేంద్రంగా మారుస్తామని ఆయన పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను పీవీఎన్ మాధవ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని రకాల క్రీడలకు అవసరమైన సదుపాయాలు రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్నాయని చెప్పారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. చిన్న వయసు నుంచే ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా వారిని తీర్చిదిద్దుతామని మాధవ్ పేర్కొన్నారు. చెస్‌ను ప్రతి పాఠశాలలో భాగం చేయాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ, మానవ చరిత్రలో అత్యుత్తమమైన ఆటల్లో చెస్ ఒకటని అన్నారు. ఈ ఆట కేవలం వినోదం కోసమే కాదని, మానసిక శక్తిని పెంచే సాధనమని పేర్కొన్నారు. చెస్ ఓపిక, క్రమశిక్షణ, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే గుణాన్ని నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న పీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ

సాంఘిక పెట్టుబడే అభివృద్ధికి పునాది

- విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్

గుంటూరుకార్పొరేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అనుభవాలను పరిశీలిస్తే సాంఘిక పెట్టుబడి ప్రబలంగా ఉన్న దేశాలే వేగంగా అభివృద్ధి చెందాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ పేర్కొన్నారు. భారతదేశంలో ప్రజలను కులాలు, మతాల వారీగా విభజించడం వల్లే త్వరగా అభివృద్ధి చెందలేకపోతున్నామని అన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన చేయూత ఫౌండేషన్ ప్రారంభోత్సవ సభకు రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1990లో భారతదేశం, చైనా తలసరి ఆదాయం చేరో 330 డాలర్లు ఉండగా, నేడు చైనా 14,800 డాలర్లకు చేరుకుందని చెప్పారు. భారతదేశం మాత్రం 2,600 డాలర్లకే పరిమితమైందని అన్నారు. భారత సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడానికి చేయూత ఫౌండేషన్ లాంటి సంస్థలు ప్రధాన పాత్ర పోషించాలని, నైపుణ్యం గల విద్యను ప్రతిభ గల పేదలకు అందించాలని రమేశ్ కోరారు. అనంతరం మానవతావాది బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి మాట్లాడుతూ, నేటి విద్యాసంస్థలు నైపుణ్యాలు అందించకుండా డిగ్రీలను అందజేసే ఉత్పత్తి కేంద్రాలుగా కొనసాగుతున్నాయన్నారు. అత్యున్నత ప్రతిభ కలిగి పేదరికాన్ని అనుభవిస్తున్న విద్యార్థులకు వారు స్థిర పడే వరకు చేయూతనివ్వాలని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ, పాప పుణ్యాల పరిధిని దాటి దాతృత్వం వైపు అడుగులు వెయ్యాలని కోరారు. విద్య, పరిశోధనలపై పెట్టుబడులు పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, ప్రముఖ ఆడిటర్ టీజేపీఎస్ కళాశాల సెక్రటరి కె.వి బ్రహ్మం, కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్, మానవత చైర్మన్ పావులూరి రమేశ్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, కౌండిన్య ఐఏఎస్ వ్యవస్థాపకులు ఇ.వి. నారాయణ, ప్రముఖ విద్యా వేత్త కన్నా మాస్టర్ పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు.



ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేశ్

అద్భుతంగా ఆర్టీసీ

(7వ పేజీ తరువాయి)

తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చి పనులను చేపడుతున్నాయి. సీడ్‌యాక్సిస్ రోడ్డు వెంబడే తమకు భూములు కేటాయించాలని మరికొన్ని సంస్థలు ప్రభుత్వపెద్దలపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ క్రమంలో రాజధానిలో బస్‌స్టేషన్ల ఏర్పాటుకు 165 ఎకరాలను కేటాయించాలని ఏపీఎస్‌ఆర్టీసీ సీఆర్‌డీఏకు విన్నవించుకుంది. ఈ మేరకు ఆ సంస్థ ఎండీ ఈ ఏడాది జూన్‌లోనే లిఖితపూర్వక విజ్ఞాపనపత్రాన్ని సీఆర్‌డీఏకు అందజేసి, ఆ విషయాన్ని ప్రభుత్వపెద్దల దృష్టికి కూడా తీసుకెళ్లారు. రాజధాని అమరావతి నగరంలో తిరిగే సిటీ సర్వీసులన్నీ పూర్తిగా ఎలక్ట్రిక్ లేదా, బ్యాటరీ వాహనాల రూపంలోనే ఉంటాయి. దీనివలన అమరావతిలో కాలుష్యం గణనీయంగా తగ్గనున్నది. ఆర్టీసీ నుంచి మూడు నెలల క్రితం సీఆర్‌డీఏకు ఈ ప్రతిపాదనలు అందినప్పటికీ ఎందువలనో ఆ సంస్థకు భూ కేటాయింపులు చేయలేదు. ఆర్టీసీకి భూ కేటాయింపులు, బస్‌స్టేషన్లు, డిపోల ఏర్పాటు తదితరాలన్నీ కూడా రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉండే అంశాలే కాబట్టి.. ప్రభుత్వం ఒకింత జాప్యం చేస్తుండవచ్చని భావించాలి.

మూడు టెర్మినల్స్.. తొమ్మిది బస్‌స్టేషన్లు

నవ నగరాల్లో ఎక్కడికక్కడ అంటే బస్‌స్టేషన్, దానికి అనుబంధంగా డిపోను ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ఒక్కో నగరంలో బస్‌స్టేషన్‌కు ఐదెకరాలు, డిపోకు ఇంకో ఐదెకరాలు.. వెరసి ఒక్కోచోట పదెకరాల చొప్పున నవనగరాల్లో కలిపి 90 ఎకరాలను కేటాయించాలని ఆర్టీసీ కోరుతుంది. నగరానికి మూడు వైపులా మూడు భారీ ఇంటర్‌ఛేంజ్ టెర్మినల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఒక్కో టెర్మినల్స్ కోసం 25 ఎకరాల వంతున మూడు టెర్మినల్స్‌కు కలిపి 75 ఎకరాలు అవసరమని ఆర్టీసీ భావిస్తుంది. ఈ టెర్మినల్స్‌లో సుదూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు దిగి అక్కడి నుంచి సిటీ సర్వీసులను వినియోగించుకుని రాజధాని నగరంలో తాము వెళ్లాల్సినచోటుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు.

- హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం రాయపూడి సమీపంలో ఓ టెర్మినల్
- బెంగళూరు, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం నీరుకొండ, పెదపరిమి మధ్య ఓ టెర్మినల్
- ఉత్తరాంధ్ర, రేపల్లె ప్రాంతాల నుంచి వచ్చేవారి కోసం మంగళగిరి పశ్చిమ శివారులో మరో టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ప్రతిపాదిస్తోంది.

ఏపీ ఎడ్‌సెట్ చివరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఎడ్‌సెట్-2025 చివరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రవేశాల కన్వీనర్ ఆచార్య స్వామి శనివారం విడుదల చేశారు. వెబ్ కౌన్సెలింగ్ కోసం అభ్యర్థులు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 3లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు వచ్చే నెల 5 నుంచి 7 వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్‌లో మార్పులు చేసుకోవాలనుకుంటే వచ్చే నెల 8న చేసుకోవాలని ఆయన చెప్పారు. వెబ్ ఆప్షన్స్ ఇచ్చిన అభ్యర్థులకు వచ్చే నెల 10న ప్రవేశాలు కేటాయిస్తామని తెలిపారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు అక్టోబరు 13న వారికి కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని చెప్పారు. అదేరోజు బీఈడీ తరగతులు ప్రారంభమవుతాయని కన్వీనర్ స్వామి పేర్కొన్నారు.

నేడు ఏపీ పీజీసెట్ రెండో దశ కౌన్సెలింగ్ షెడ్యూల్

కళాశాలల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన రెండో దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ ను ఆదివారం విడుదల చేస్తున్నట్లు ఏపీ పీజీసెట్-2025 కన్వీనర్ ఆచార్య రవికుమార్ శనివారం తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను ఈ నెల 29 నుంచి వచ్చే నెల 4లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5 వరకు జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా వచ్చే నెల ఒకటి నుంచి ఐదులోపు కళాశాలలు నమోదు చేసుకోవాలని ఆయన వివరించారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా ఇచ్చిన కళాశాలల్లో ఏమైనా మార్పులు చేసుకోవాలనుకుంటే వచ్చే నెల 6న చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు వచ్చే నెల 8న ప్రవేశాలు కేటాయిస్తామని చెప్పారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు వచ్చే నెల 8 నుంచి 11 లోపు వారికి కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేయాలన్నారు. నూతన విద్యార్థులకు పీజీ తరగతులు వచ్చే నెల 8న ప్రారంభమవుతాయని కన్వీనర్ రవికుమార్ పేర్కొన్నారు.

'జ్యోతి'కి ఉద్యోగ కల్పన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంధత్వంతో బాధపడుతూ కుమారుని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న పాముల పాటి జ్యోతికి ఉద్యోగం కల్పించారు. పాత గుంటూరులో నివాసం ఉంటున్న జ్యోతి గురించి 'పాపం జ్యోతి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించగా.. ఈ కథనానికి రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పారిశుధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ విధానంలో జ్యోతికి ఉద్యోగం కల్పిస్తూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దివ్యాంగులశాఖ సహాయ సంచాలకులు డి. దుర్గాబాయి మాట్లాడుతూ జ్యోతి ఎనిమిదేళ్ల కుమారుడు కొద్ది రోజుల క్రితం న్యూమోనియా వ్యాధికి గురికాగా జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందేటట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మోటారు సైకిల్ - కారు ఢీ : వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం కాకాని గ్రామం వద్ద మోటారు సైకిల్-కారు ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పిడుగురాళ్ళ మండలం జానపాడు గ్రామానికి చెందిన రహంతుల్లా (45) తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రహంతుల్లా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తొలుత నరసరావుపేటలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించే సమయంలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న రాజేష్‌దిగా మృతుని బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కొత్త అజయ్ (ఫైల్)

వినుకొండటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి యువకుడు మృతిచెందిన ఘటన వినుకొండలో శుక్రవారం జరిగింది. నూజెండ్ల మండలం ఓబనపాలెం గ్రామానికి చెందిన కొత్త అజయ్ (21) కుటుంబసభ్యులతో కలిసి గత ఏడేళ్లుగా బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో జీవనం సాగిస్తున్నారు. అతడి స్నేహితుడు అశోక్ గ్రామానికి సమీపంలో ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం షాపును అద్దెకు తీసుకున్నాడు. షాపుకు ఫ్లెక్సీలు కట్టేందుకు తోడుగా అజయ్‌ను తీసుకెళ్లాడు. ఫ్లెక్సీలు కడుతుండగా సమీపంలోని వీధిలైట్ల విద్యుత్ వైర్లు తగిలి అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి

కారంపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకు వెళ్లి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన శనివారం కారంపూడిలో జరిగింది. నరసరావుపేటకు చెందిన ముగ్గురు బాలురు పదో తరగతి చదువుతూ దసరా సెలవులు నిమిత్తం వారి పెద్దమ్మ గారి ఊరైన కారంపూడికి చెందిన జాహీరా ఇంటికి వచ్చారు. దుస్తులు ఉతికేందుకు జాహీరా వెళుతుండగా ఆమెతోపాటు ఖాదర్‌వలి, నాగుల్‌మీరా, సయ్యద్ సత్తార్ సరదాగా ఈత కొట్టేందుకు వినుకొండ రోడ్డులో గల సాగర్ కుడికాలువకు వెళ్లారు. ఈత కొడుతూ ముగ్గురూ మునిగిపోయారు. స్థానికులు గమనించి ఖాదర్‌వలి, నాగుల్‌మీరాను రక్షించగా సయ్యద్ సత్తార్ నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సత్తార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు గురై రైతు మృతి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై రైతు మృతి చెందిన పిడుగురాళ్ల మండలంలోని చెన్నాయపాలెంలో శనివారం జరిగింది. చెన్నాయపాలెం గ్రామానికి చెందిన జంగిటి శ్రీనివాసరావు (45) తన బెండ తోటలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు పోలీసులు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సంక్షేమ గ్రూపు డైరెక్టర్‌గా రాములు బాధ్యతలు



తుళ్లూరు సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్నల్ వెలుగోటి రాములు సీఆర్ డీఏ సామాజిక సంక్షేమ విభాగ గ్రూప్ డైరెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించడానికి ముందు సీఆర్‌డీఏలోని ముఖ్య అధికారులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం, సీఆర్‌డీఏ సిబ్బంది రాములును చాంబర్‌లో కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. అమరావతి రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం, రాజధానిలోని ఇతర వృత్తి పనివారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా రాములు పేర్కొన్నారు. అమరావతి ప్రాంత వాసుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు, యువత, మహిళలకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన చెప్పారు.

స్థానిక సంస్థలకు మొండిచేయి!

(7వ పేజీ తరువాయి)

పరిషత్‌లకు విభజించి ఖాతాలకు జమ చేస్తారు. ఇక పట్టణ పరిధిలో ఆస్తుల క్రయవిక్రయాల సర్‌చార్జి మొత్తం మునిసిపాలిటీ ఖాతాకే జమ చేస్తారు. ఒక్క నరసరావుపేట మునిసిపాలిటీకి ఏడాదిగా సర్‌చార్జి నిధులు రూ.7 కోట్లు విడుదల కావాల్సి ఉంది.

నిధుల లేమితో..కునారిల్లుతున్నాయి

నిధుల లేమితో కొన్ని మునిసిపాల్టీల్లో జీతాలు సకాలంలో చెల్లించలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రేషన్ సర్‌చార్జికి సంబంధించిన ప్రొసీడింగ్స్ ఖజానాకు పంపించకుండా రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆదేశించినట్లు సమాచారం. మళ్లీ ఆదేశాలు ఇచ్చే వరకు ప్రొసీడింగ్స్ నిలుపుదల చేయాలని ఆదేశించారు. సర్‌చార్జి నిధుల కోసం స్థానిక పాలక వర్గాలు, అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నిధులు జమ కావాలంటే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. ప్రభుత్వ ఆదేశాల వస్తే ప్రొసీడింగ్స్‌ను పంపుతామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఎప్పటికి కరుణిస్తుందోనని సదరు పాలక వర్గాలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

మహిళలు ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు

సద్వినియోగం చేసుకోవాలి

కర్లపాలెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలు ఇళ్లల్లో ఆనందంగా ఉండాలని దసరా పండుగ సందర్భంగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం 3.0 ద్వారా దేశంలో 25 లక్షలు మందికి ఉచిత గ్యాస్ (ఎల్‌పిజి) కనెక్షన్‌లు మంజూరు చేశారని బీజేపీనాయకులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రతి మహిళా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్యాస్ ఏజెన్సీ దగ్గరకు వెళ్ళి రేషన్‌కార్డు, భార్యభర్తల ఆధార్‌కార్డు, మహిళా పేరుతో ఉన్న బ్యాంక్ పాస్‌బుక్, 2 పాస్‌ఫోటోలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకొని ఉచితంగా గ్యాస్ స్టవ్, ఎల్‌పిజి సిలెండరు, రెగ్యులేటర్, రెగ్యూలేటర్, సురక్షట్యూబ్ బాండ్ పాస్ బుక్ పొందాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ మైనార్టీ నాయకులు షేక్ కరీముల్లా, బాపట్ల వ్యవసాయ మార్కెట్‌కమిటి డైరెక్టర్ అడపాల రామరాజు, పరిమి శివరామకృష్ణసాయి, మద్దిబోయిన బుల్లియ్యలు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉపాధి అవకాశాలు

కర్లపాలెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు వృత్తి సంబంధిత అనుభవాన్ని సంపాదించటమే కాకుండా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు దారితీసే వినూత్న జ్ఞానాన్ని సొంతం చేసుకుంటారని జిల్లా వృత్తి విద్య సమన్వయకర్త వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని యాజలి ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు ఆటోమోటివ్ ట్రేడ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సుగమణి ఆధ్వర్యంలో ఆయన శనివారం విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన కల్పించారు. వృత్తి విద్య శిక్షకుడు వై.సాయిబాబు పర్యవేక్షణలో విద్యార్థులకు మెకానిజం నేర్పించారు. దసరా సెలవులలో భాగంగా ప్లస్ విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం, నైపుణ్యాలాభివృద్ధి కొరకు ఇంటర్న్‌షిప్ నిర్వహించామని హెచ్‌ఎం సుగుమణి తెలిపారు.

సుధాకర్ ప్రసాద్ సేవలు చిరస్మరణీయం

● రెవెన్యూ సర్వీసెస్ అసోసియషన్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు

బాపట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతూ అశువులు బాసిన తోట సుధాకర్ ప్రసాద్ సేవలు చిరస్మరణీయమని రెవెన్యూ సర్వీసెస్ అసోసియషన్ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.సురేష్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం సుధాకరప్రసాద్ 24వ వర్ధంతి నిర్వహించారు. అనంతరం సుధాకరప్రసాద్ జీవితచరిత్ర పుస్తకాన్ని కలెక్టరేట్ ఏవో డి.మల్లిఖార్జునరావు అవిష్కరించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.ఓంకార్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు ఎస్‌కె.మహబూబ్ బాషా, కార్యదర్శి సుమంత్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యశోదక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం

బాపట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావుపూలే స్థాపించిన సత్యశోదక్ సమాజ్ 153వ అవిర్భావ దినోత్సం ఘనంగా నిర్వహించారు. బాపట్ల అంబేద్కర్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల మహిళలకు విద్య, సామాజిక హక్కులు కల్పించటం, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటమే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు ముప్పల పల్లవి, లాజర్, సంతోషి, దొప్పలపూడి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు లోక్ కల్యాణ్ మేళా

బాపట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ కార్యాలయంలో ఈనెల 29వ తేదీ సోమవారం లోక్‌కళ్యాణ్ మేళా నిర్వహిస్తున్నట్లు మెప్మాసీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో వీధి విక్రయ వ్యాపారులు రుణాలు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. గతంలో 1400మందికి పీఎం స్వాహనిధి 2.0 ద్వారా రుణాలివ్వటం జరిగిందన్నారు. కొత్తగా 465 మందికి టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. గతంలో రుణాలు పొంది చెల్లించిన వారితోపాటు కొత్తగా రుణాలు పొందేవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే వీధి విక్రయదారులకు మెడికల్ క్యాంప్ నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగశన నరేంద్రవర్మ, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

బాలకృష్ణ ఫ్లెక్సీ తగలబెట్టిన వైసీపీ నాయకుడిపై బైండోవర్

బాపట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సినీనటుడు చిరంజీవిపై ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య శనివారం బాపట్ల రథం బజారులో బాలకృష్ణ ఫ్లెక్సీని తగలబెట్టాడు. దీని గురించి తెలుసుకున్న పట్టణ సీఐ ఆర్.రాంబాబు సిబ్బందితో కలిసి వచ్చి రామయ్యను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్ళి అతనిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. రూ.2లక్షలకు బైండోవర్ చేశారు.

అంబేద్కర్ విగ్రహ గ్రిల్స్‌ను ఢీకొట్టిన లారీ

చెరుకుపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లిలో శనివారం తెల్లవారుజామున ఒంగోలు నుండి మచిలీపట్నం వెళుతున్న తిరుమల మిల్క్‌డైరీకి చెందిన లారీ అదుపుతప్పి ఐలాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ముందు ఉన్న ఇనుప మెట్లను, రాతి దిమ్మెలను గుద్దుకుని ఆగిపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. డ్రైవర్ నిద్రమత్తులో ఈప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. దళితసంఘాల నేతలు ప్రమాదస్థలానికి చేరుకుని సెంటర్లో ఉన్న విగ్రహానికి తగిన రక్షణ ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని రాస్తారోకో చేశారు. నగరం ఎస్ఐ భార్గవ్ వారికి నచ్చచెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

నిరాశ్రయ కుటుంబానికి ఆర్థిక చేయూత

కొల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి ఇల్లు కూలి నిరాశ్రయులైన కుటుంబానికి దాతలు ఆర్థిక చేయూత అందించారు. శనివారం కొల్లూరులోని పాముల రత్నం, యశోద కుటుంబం ఇటీవల కురిసిన వర్షాల వల్ల వారి ఇల్లు కూలిపోయిన విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, గృహలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ యజమాని తుమాటి శ్యాంబాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోరికపూడి ప్రసాద్, గాదె చంటి, బుర్రి జగన్, యడ్ల శ్రీనివాసరావు, పోతార్లంక కుటుంబరావు, కుర్రా సత్యనారాయణ, మేడికొండ అనీల్‌కుమార్ తదితరులలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ

చెరుకుపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి గౌడపాలెంలో ఎన్‌ఆర్‌జీఎస్ గ్రాంట్ రూ.6లక్షలతో సీసీ రోడ్డుకు శనివారం నీటిసంఘాల డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షుడు ఎం.రాధాకృష్ణమూర్తి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ లచ్చి అరుణరామారావు, రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షులు దివి రాంబాబు, టీడీపీ నాయకులు విస్సంశెట్టి శ్రీనివాసరావు, నాగుల పున్నారావు, శొంఠి కోటయ్య, గడ్డంశ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం వినియోగంలో దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండాలి

● నగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్‌ప్రసాద్

నగరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం వినియోగంలో దుష్ప్రభావాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని నగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం నగరం పరిధిలోని పూడివాడలో ప్రజల ఆరోగ్యరక్షణే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం కేర్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. అలాగే మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా వలన కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, రవాణా, గురించిన సమాచారం కంట్రోల్‌రూం నెం.14405కి కానీ నగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నెం.9490455599కి కానీ తెలియపరచాలని తెలిపారు. అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు, ఎక్సైజ్‌సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్

నిర్దిష్ట కాలవ్యవధిలో వ్యర్థాలు తరలించాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): డంపింగ్‌యార్డులోని లెగసిని నిర్ధిష్ట కాలపరిమితిలోపు తరలించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్లపట్టణం చెరువుజమ్ములపాలెం రోడ్డులోని డంపింగ్‌యార్డును శనివారం మున్సిపల్ అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. అక్కడ యంత్రాల పనితీరును, చెత్త రిసైక్లింగ్‌ను పరిశీలించారు. రీసైక్లింగ్‌పై మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డిని ఆరాతీశారు. డంపింగ్‌యార్డులోని చెత్తను రీసైక్లింగ్ చేసే పనిని గుంటూరులోని ఎంఎస్ తారుని అసోసియేషన్‌వారు చేపట్టారని తెలిపారు. ఈ ఏడాది మార్చిలో అవార్డు పొందేనాటికి డంపింగ్‌యార్డులో 46,264 మెట్రిక్‌టన్నుల చెత్త ఉందని అందులో ఇప్పటివరకు 40వేల మెట్రిక్‌టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసినట్లు కమిషనర్ వివరించారు. రేపల్లె, మున్సిపాలిటికి సంబంధించిన చెత్తను బాపట్ల డంపింగ్‌యార్డులో డంప్ చేస్తారని కలెక్టర్‌కు తెలిపారు. డంపింగ్‌యార్డులోని చెత్త మొత్తం ప్రాసెసింగ్ చేసి అక్టోబరు 2వ తేది నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అసోసియేషన్‌వారికి తెలిపారు. ప్రతి రోజు ఎంత చెత్త వస్తుంది ఎంత ప్రాసెసింగ్ చేస్తున్నారు, ఎంత గుంటూరు తరలిస్తున్నారు. అనే అంశాలు గురించి కలెక్టర్ పూర్తి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.



డంపింగ్‌యార్డు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

అందుబాటులో 235 మెట్రిక్ టన్నుల యూరియా

జిల్లాలో 225మెట్రిక్‌టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం నాటికి వ్యవసాయశాఖా ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌కెలు, పిఏసిఎస్‌లు 15 ద్వారా 235 మెట్రిక్‌టన్నుల యూరియా 2765 మంది రైతులకు పంపిణీ చేశారన్నారు. ఇంకా 225 మెట్రిక్‌టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు అభినందనలు

బాపట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అభినందించారు. శనివారం ఉదయం కలెక్టర్ దంపతులు శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో నిర్వహించిన పూజలలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయం ఎదుట రథం బజారులో పారిశుధ్య కార్మికులు ఏర్పాటు చేసిన రంగోళి కార్యక్రమం, కోలాటప్రదర్శన, వేస్ట్‌టూ ఆర్ట్ కార్యక్రమాలను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులను అభినందించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి సిబ్బంది కలిసి కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతాహి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ప్లాస్టిక్ నిషేదానికి సహకరించి గుడ్డ సంచలను మాత్రమే వినియోగించాలన్నారు. వస్తువులను కొనుగోలు చేయటానికి వచ్చే ప్రజలు గుడ్డ సంచులు, స్టీల్‌బాక్స్‌లు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, టిపివో ఎస్.మల్లిఖార్జునరావు, ఆర్‌వో అబ్దుల్ జబ్బార్, శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సి.హెచ్.కరుణ, సయ్యద్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అలంకారాలు



కర్లపాలెం: శ్రీకాళీకమ్మతల్లి ఆలయంలో లలితాదేవి అమ్మవారి అలంకారం



కర్లపాలెం: సత్యవతిపేటలో లలితా దేవి అమ్మవారు



వేమూరు: జంపని రామేశ్వరలయంలో కాత్యాయనిదేవి అలంకారం



వేమూరు: అబ్బనగూడవల్లి శివాలయంలో లలితా త్రిపురసుందరి అలంకారం

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలులో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో దేవినవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీపార్వతి అమ్మవారు శ్రీగజలక్ష్మీదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అల్లూరు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారిని శ్రీకాత్యాయని దేవి అలంకరించారు. ఖాజీపాలెం శ్రీకాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీశాంభవిదేవిగా దర్శనమిచ్చారు.


- కర్లపాలెం: మండలంలోని శ్రీకనకదుర్గమ్మ శ్రీలలితా అమ్మవారిగా దర్శనమిచ్చారు. కర్లపాలెంలోని శ్రీరామకృష్ణసేవా సమితి, శ్రీపెద్దింటమ్మతల్లి కళ్యాణమండపం, ఆర్యవైశ్యకళ్యాణమండపం, శ్రీకాళికమ్మతల్లి ఆలయం, మంతెనవెంకటరాజుపాలెం ఆలయం,బంగారురెడ్డిపాలెం ఆలయం, కొత్తూరు దేవాలయం, కొత్తనందాయపాలెం శివాలయం, పాతనందాయపాలెం శివాలయంలో శ్రీకనకదుర్గమ్మఅమ్మవారు శ్రీలలితాఅమ్మవారిగా దర్శనమిచ్చారు.
- వేమూరు: చావలి వాలేశ్వరాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా, జంపని రామేశ్వరాలయంలో కాత్యాయనిదేవిగా, అబ్బనగూడవల్లి శివాలయంలో లలితా త్రిపురసుందరిదేవిగా అలంకరించారు.
- రేపల్లె: నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో శ్రీబాలాత్రిపురసుందరీదేవి, రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దుర్గమ్మ దర్శనమిచ్చింది.
- కొల్లూరు: కొల్లూరులోని గంగాపార్వతీ అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు లలితత్రిపురసుందరి దేవిగా, మండలంలోని కోటిపల్లి సోమశేఖరస్వామి ఆలయంలో సత్యజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు చాముండేశ్వరిదేవిగా, భట్టిప్రోలులో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో చాముండేశ్వరి దేవిగా, పార్వతీ అమ్మవారు శైలపుత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- చుండూరు: వలివేరులో శ్రీలలితాంబ అమ్మవారి దేవాలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరిగా, చినపరిమిలోని శ్రీగంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ధనలక్ష్మి అలంకరణ దర్శనమిచ్చారు.
- బాపట్ల: సూర్యలంకరోడ్డులో శ్రీలలితా త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో అమ్మవారు శ్రీలలితాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



భట్టిప్రోలులో చాముండేశ్వరి అలంకారంలో వాసవీ అమ్మవారు



పిట్టలవానిపాలెం: శ్రీ కాత్యాయని దేవి అలంకరణలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు



పిట్టలవానిపాలెం: శ్రీగాయత్రిదేవి అలంకరణలో పార్వతి అమ్మవారు



రేపల్లె: 23వ వార్డులో రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



కొల్లూరు: కోటిపల్లిలో చాముండేశ్వరి అలంకారంలో సత్యజ్ఞానప్రసూనాంబ



బాపట్ల: శ్రీలలితా త్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు



చుండూరు: వలివేరులో బాల త్రిపురసుందరిగా అమ్మవారు

రీసర్వేపై రైతులకు అవగాహన

కొల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వేపై రెవెన్యూ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని చిలుమూరు, రావికంపాడు గ్రామాల్లో మూడోవిడత రీసర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో రీసర్వే ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద జరిగిన గ్రామ సభల్లో రీసర్వే వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డిటి శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రావికంపాడులో రీసర్వే ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది

మొబైల్ బుక్ కీపింగ్ నూరుశాతం పూర్తి చేయాలి

● సెర్ప్ అడిషనల్ సీఈవో ఆర్.శ్రీరాములునాయుడు

బాపట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మొబైల్ బుక్ కీపింగ్‌ను నెలాఖరులోపు పూర్తి చేయాలని వివోఎలకు సెర్ప్ అడిషనల్ సీఈవో ఆర్.శ్రీరాములునాయుడు తెలిపారు. బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రంలో శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-వెలుగు సిబ్బందికి, 25మండలాల ఏపీఎంలకు, డీపీఎంలతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా శ్రీరాములునాయుడు మాట్లాడుతూ నూరుశాతం బుక్‌కీపింగ్ చేయని వీవోఏలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నిరకాల రుణాలను డిజిటల్ ఎంపిసి ద్వారా మాత్రమే సభ్యులకు మంజూరు చేస్తామన్నారు. మండల సమైక్యల ద్వారా మంజూరు చేసే నిధులు కూడా ఆన్‌లైన్ ద్వారా మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎస్.లవన్న, సెర్ప్ సిబ్బంది ఎల్.వాల్మీకి, శ్రీనిధి ఏజీఎం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ అడిషనల్ సీఈవో శ్రీరాములునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ

కార్యకర్తల సంక్షేమానికి జనసేన కృషి

బాపట్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి జనసేనపార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ విశేష కృషి చేస్తున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ పేర్కొన్నారు. బాపట్ల పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన సభ్యత్వం తీసుకొని మృతి చెందిన ఇరువురి కుటుంబ సభ్యులకు ప్రమాదబీమా కింద రూ.5లక్షల చొప్పున ఇచ్చామన్నారు. కర్లపాలెం గ్రామానికి చెందిన బాలిగా హరీష్, యాజలి గ్రామానికి చెందిన మరకా రాజులు మృతి చెందటతో కుటుంబ సభ్యుల ఖాతాలో డబ్బులు జమ చేశామన్నారు. సమావేశంలో ఇక్కుర్తి చక్రపాణి, హుస్సేన్‌బేగ్, జిడుగు విజయ మాధురి, నంగనం సుబ్బరాజు, సత్యనారాయణ, గంటా నాగమల్లేశ్వరరావు, సాయిమురళి, నాగరాజు, సుధాకర్, బెజ్జం బాబు, సుజిత్, కామిశెట్టిసాయి, చల్లాపల్లి ఏసోబు, షేక్.రఫీ,జహీర్,శ్యాంకుమార్, రత్నకుమార్, మోహన్, మాధవి తదితరులు పాల్గొన్నారు.



దుర్గామల్లేశ్వర దేవస్థానం బూత్‌కమిటీ సభ్యుడిగా ఎన్నికైన నాగేశ్వరరావును అభినందిస్తున్న అనగానిశివప్రసాద్

దుర్గామల్లేశ్వరస్వామి బోర్డు కమిటీ సభ్యుడిగా నాగేశ్వరరావు ఎంపిక హర్షణీయం

రేపల్లె, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రేపల్లె సీనియర్ టీడీపీ నాయకుడు జీవీ నాగేశ్వరరావును విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవాలయ బోర్డుకమిటీ సభ్యుడిగా ఎన్నిక చెయ్యటం హర్షణీయమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో బోర్డుకమిటీ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా కేక్ కట్‌చేసి నాగేశ్వరరావును సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కమిటీసభ్యులుగా ఎన్నిక చెయ్యటం వారికి రుణపడి ఉంటామన్నారు. స్థానికంగా నాకు చేయూతనిచ్చిన అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలసాని రాము, పీవీ చింతారావు, గుర్రం మురహరిరావు, కంతేటి శివరామకృష్ణ, పొన్నూరి గౌరీరామకుమారి, నాగశ్రీ, పంతగాని ప్రేమలత పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబాల వృద్ధి

చెరుకుపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శనివారం మండలంలోని ఆరేపల్లి గ్రామం వాకావారిపాలెంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సందర్శించిన బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీరాంపల్లి జగన్నాథ శాస్త్రి మాట్లాడుతూ మహిళలు, ఆడపిల్లలు, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబాలు వృద్ధి చెందుతాయన్నారు. వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. శిబిరంలో కనగాల పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ జీవలతా ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పొన్నపల్లి సత్యన్నారాయణ, దామర్ల చంద్రబాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న కనగాల పీహెచ్‌సీ సిబ్బంది

తీరప్రాంతం ఎంతో ప్రసిద్ధి చెందింది

రేపల్లె, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని ఎంతో చరిత్రగల దేవాలయాలు, బీచ్‌లు, పుణ్యక్షేత్రాలతో రేపల్లె ప్రాంతానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు అన్నారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్వచ్ఛతాహిసేవ, స్వచ్ఛఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలను శుభ్రపరిచి పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులకు పరిసరాల పరిశుభ్రతపై వారంలో ఒక్కరోజు శ్రమదానం చెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్‌మాస్టర్ పి.సతీష్, ఆర్‌పీఎఫ్, ఎస్ఐ జీ.వెంకటప్పయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎం.రాంబాబు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.




రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

సాగర్‌లో 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల




విజయపురిసౌత్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు శనివారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.30 అడుగులుగా ఉంది. ఇది 305.68 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,023 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 3,76,402 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్ ఫ్లో వాటర్‌గా 4,19,598 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 4,19,598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 3,93,615 క్యూసెక్కుల నీటి విడుదల



రెంటచింతల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు శనివారం 3,93,615 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, సాయి నిరంజన్ చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి ప్రాజెక్టుకు 3,92,999 క్యూసెక్కుల నీరు వచ్చిందని తెలిపారు. రిజర్వాయర్‌లో 74.73 మీటర్ల మేర నీరుండగా ఇది 6.560 టీఎంసీలకు సమానమని చెప్పారు. భారీ వరద కారణంగా ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి



తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని భారీగా విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 3,83,961 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజీకి వచ్చి చేరుతోంది. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3,75,125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. తూర్పు డెల్టా కాలువకు 4,323 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగుతుండడంతో దిగువ నది తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

వాహన విక్రయదారుల్లో.. దసరా జోష్

● పండుగ ఆఫర్లు, జీఎస్టీ తగ్గింపుతో ఊపందుకున్న కొనుగోళ్లు
● ఏడు రెట్లు పెరిగిన బైక్ అమ్మకాలు ● రూ.లక్ష వరకు తగ్గిన కార్ల ధరలు


గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ రాగానే మార్కెట్లు రద్దీగా మారుతాయి. ముఖ్యంగా వాహనాల అమ్మకాలు పెరగటం ప్రతి ఏటా కనిపిస్తుంది. ఈ సారి పండుగ ఆనందానికి తోడు జీఎస్టీ తగ్గింపు కూడా తోడైంది. పన్ను భారం తగ్గటంతో ప్రజలు కొత్త వాహనాల కొనుగోలుకు పోటెత్తుతున్నారు. ఫలితంగా జిల్లాలోని వాహనాల అమ్మకాలు ఐదు నుంచి ఏడు రెట్లు పెరిగాయి. షోరూమ్‌లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి.

● రికార్డుస్థాయిలో ద్విచక్రవాహనాల అమ్మకాలు

జిల్లాలో ద్విచక్రవాహనాల విక్రయాలు ఏడు రెట్లు పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. గుంటూరులోని టీవీఎస్ షోరూమ్‌లలో జీఎస్టీ తగ్గింపునకు ముందు రోజుకు 15-20 ద్విచక్రవాహనాలు అమ్ముడయ్యేవి. అయితే జీఎస్టీ అమల్లోకి వచ్చిన 22వ తేదీ తర్వాత రోజుకు 120 నుంచి 130 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి హీరో, హోండా, బజాజ్ షోరూమ్‌లలో కూడా కనిపిస్తోంది. ప్రధానంగా యూనికార్న్, పల్సర్ 150 సీసీ బైక్‌ల ధరలు రూ.10వేల వరకు తగ్గటంతో యువత వాటిపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు బైక్ కొనాలని అనుకున్నా ధరలు ఎక్కువగా ఉండటంతో వాయిదా వేసుకున్నామని, ఇప్పుడు జీఎస్టీ తగ్గింపుతో పాటు దసరా ఆఫర్ కూడా కలుపుకొని తక్కువ ధరకు వస్తుండటంతో వెంటనే బుకింగ్ చేసేశాం అని పలువురు యువకులు చెబుతున్నారు.

● కార్ల అమ్మకాలకు ఊపిరి....

జీఎస్టీ తగ్గింపుతో కార్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి. కార్ల ధరలు రూ. లక్ష వరకు తగ్గడంతో ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాల వారు కొత్త కార్ల కొనుగోలుకు ముందుకొస్తున్నారు. షోరూమ్‌లు జీఎస్టీకి ముందు, తరువాత ధరల వ్యత్యాసాలను ప్రత్యేక బోర్డులపై ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. కస్టమర్లకు ధరల తగ్గింపును స్పష్టంగా తెలియజేసేందుకు ప్రత్యేకంగా డిస్‌ప్లే బోర్డులు డీలర్లు ఏర్పాటు చేస్తున్నారు. జీఎస్టీ సంస్కరణల ప్రభావాన్ని ప్రజలకు దగ్గర చేయటానికి ప్రచార రథాలను కూడా సిద్ధం చేశామని కారు షోరూమ్ నిర్వాహకులు తెలిపారు. అమ్మకాలు ఊహించని రీతిలో పెరగటంతో రవాణాశాఖ కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసింది. వాహన యజమానులకు ఎక్కువ సమయం వృథా కాకుండా డిజిటల్ పద్ధతులను వినియోగించి రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నామని అధికారులు తెలిపారు.



షోరూమ్‌ల వద్ద పండుగ శోభ

● కొత్త కార్లు కొనలేని వారికి అందుబాటులోకి పాత కార్లు

జీఎస్టీ తగ్గింపుతో కొత్త కార్ల ధరలు దిగిరావటంతో ఇప్పటి వరకు పాత కార్లకు ఉన్న రేటు మరింతగా పడిపోయింది. ఇప్పటి వరకు కొనాలనే ఆలోచన లేని వారు కూడా తమ కారు మోజు తీర్చుకునేందుకు పాత వాటిని కొనేందుకు ముందుకొస్తున్నారు. దీంతో ప్రస్తుతం కొత్త-పాత కార్ల మార్కెట్ జోరందుకుంది.

● ఐదు రోజుల్లోనే భారీ విక్రయాలు

కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత కేవలం ఐదు రోజుల్లోనే జిల్లాలో 1900 మోటార్ సైకిళ్ళు, 90 కార్లు, క్యాబ్‌లు, 10 ట్రాక్టర్‌లు, 67 ఆటోలు, 47 గూడ్స్ వాహనాలు, 15 ఆటో గూడ్స్ వాహనాలు, 12 ఇతర వాహనాలు రవాణాశాఖ గణాంకాల ప్రకారం అమ్ముడయ్యాయి. ఈ స్థాయిలో అమ్మకాలు జరగటం గతంలో ఎప్పుడూ చూడలేదని అధికారులు చెబుతున్నారు.

అమ్మకాలు బాగా పెరిగాయి

- జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి



జిల్లాలో వాహనాల అమ్మకాలు దాదాపు ఐదు నుంచి ఏడు రెట్లు పెరిగాయి. ముఖ్యంగా కార్ల ధరలు రూ. లక్ష వరకు తగ్గటంతో వాటిపై కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు. జీఎస్టీకి ముందు ఆ తరువాత ధరల వ్యత్యాసాలను తెలిపే బోర్డులను షోరూమ్ వద్ద ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. అలాగే ప్రచార రథాలను కూడా ఏర్పాటు చేస్తున్నాం.

ఉద్యమాల పురిటి గడ్డ పల్నాడు

● పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రాభవాన్ని వివరించిన కలెక్టర్



కృతికా శుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాల పురిటిగడ్డ, పౌరుషానికి ప్రతీక పల్నాడు అని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం ఆమె పల్నాడు జిల్లా ప్రాభవాన్ని వివరించారు. ప్రపంచ పటంలో పల్నాడును ప్రత్యేక స్థానంలో నిలిపిన పల్నాటి నాయకులకు, కళాకారులకు, ప్రజలకు ప్రపంచ పర్యాటక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పల్నాడు ప్రాభవాన్ని గురించి వివరిస్తూ.. నకరికల్లు వరి ధాన్యం, లాలిపురం జామకాయలు, అడిగొప్పల రేగిపళ్ళు.. ఇలా ఎన్నో రకాల అంశాలకు పల్నాడు ప్రసిద్ధి అని చెప్పారు. తెలుగు భాష తొలి పదం "నాగబు" లిఖితరూపంలో అమరావతిలోనే కనబడిందని, బౌద్ధ మత స్తూపాల, శిథిలాల, ప్రాచీన అవశేషాల, గ్రంథాలు సమాచారాన్ని అమరావతి మ్యూజియం తెలియజేస్తుందన్నారు. రెండో బుద్ధుడు ఇండియన్ ఐన్‌స్టీన్‌గా పేరుగాంచిన ఆచార్య నాగార్జునుడు తిరగాడిన నేల పల్నాడని అన్నారు. రెడ్డి రాజుల రాజధాని కొండవీడు గురించి, శ్రీ నాథ కవిసార్వభౌముడి గురించి వివరించారు. చేజర్ల కపోతేశ్వరాలయం, గుత్తికొండ బిలం గురించి తెలియజేశారు. చాపకుడు సిద్ధాంతం ద్వారా సామాజిక న్యాయం కోసం పల్నాటి బ్రహ్మనాయుడు నిలబడ్డారని, అలాగే మహిళా మంత్రి నాగమ్మ గురించి తెలియజేశారు. కారంపూడి, కోటప్పకొండ, గురజాల, సొలస తదితర ప్రాంతాల గురించి వివరించారు. కోహినూర్ వజ్రాన్ని ప్రపంచానికి అందించిన బెల్లంకొండ మండలం కోళ్లూరు పల్నాడులోనే ఉందని, బ్రిటిష్ వారిపై కన్నెర్ర చేసి ప్రాణ త్యాగం చేసిన పుల్లరి ఉద్యమ కొదమసింహం కన్నెగంటి హనుమంతు, అలాగే మహాకవి గుర్రం జాషువా పల్నాడు ప్రాంతం వారేనని చెప్పారు. సుగంధ ద్రవ్యాలకు యడ్లపాడు ప్రసిద్ధని, పులిచింతల చింతలు తీర్చే అమృతవాహినని అన్నారు. అలాగే నరసరావుపేటలోని రాజు గారి కోట, నిదానంపాటి అమ్మవారు కొలువైన అడిగొప్పల గురించి వివరించారు. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం జన్మస్థలం ఇరుకుపాలెం అని, తెలుగు తమిళ, కన్నడ భాషలలో ప్రసిద్ధి గాంచిన గాయకుడు మనో పల్నాడు వాడేనని చెప్పడం గర్వంగా ఉందని చెప్పారు. దేశంలో అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టు నాగార్జున సాగర్ పల్నాడులోనే ఉందని, అతిపెద్ద పులుల అభయారణ్యం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్టని చెప్పారు. వేలాది మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్న స్పిన్నింగ్ మిల్లులు, ఎక్కువ సిమెంట్ ఫ్యాక్టరీలు పల్నాడులోనే ఉన్నాయని కృతికా శుక్లా తెలియజేశారు.

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెంగుళూరుకు చెందిన తండ్రీ కుమారులను కిడ్నాప్ చేసి సంతమాగులూరు సమీపంలో జంట హత్యలకు పాల్పడిన కేసులో 12వ నిందితుడైన సంతమాగులూరుకు చెందిన గడ్డం ప్రభాకర్ రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు వారు చెప్పారు. ఈ కేసులో మొత్తం 13 మందిని నిందితులుగా ఉన్నారని, వీరిలో ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేశామని తెలిపారు. మరో ఇరువురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

గోవుల అక్రమ తరలింపును అడ్డుకున్న గో- పరివార్

● తాడేపల్లి పోలీసులకు అప్పగింత

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోవులను హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్న లారీని గో- పరివార్ సంస్థ ప్రతినిధులు శనివారం అడ్డుకున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి కనకదుర్గమ్మ వారధి వద్ద లారీని అడ్డుకున్న గో- పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు తోట సురేష్‌బాబు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని డ్రైవర్‌తోపాటు లారీని అదుపులోకి తీసుకున్నారు. గోవులను గోశాలకు తరలించారు. ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా 52 గోవులను లారీలో కుక్కి తరలిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో గో- పరివార్ సురేష్ పేర్కొన్నారు.



గోవులను తరలిస్తుస్తున్న లారీ

బాపట్ల తీరంలో తొలి 5 స్టార్ రిసార్టు

● వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబునాయుడు



వర్చువల్‌గా బై ది బే రిసార్టును ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తీర ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రత్యేక గుర్తింపు రావడానికి రిసార్టులు ఎంతగానో దోహదం చేస్తాయని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలో నూతనంగా నిర్మితమైన తొలి 5 స్టార్ గోల్డెన్‌శాండ్స్ బై ది బే రిసార్టును విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి సీఎం శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసార్టు విశేషాలను నిర్వాహకులు సీఎంకు వివరించారు. అత్యాధునిక 5 స్టార్ సదుపాయాలతో 147 గదులు, వెయ్యి మందికి పైగా సామర్థ్యం ఉండే లాన్, 400 మందికి అనువైన బ్యాంకెట్ హాల్‌తో 10.75 ఎకరాల విస్తీర్ణంలో ఈ 5 స్టార్ రిసార్ట్ నిర్మితమైనట్లు నిర్వాహకులు సీఎంకు తెలిపారు. దాదాపు రూ.150 కోట్ల ఖర్చుతో నిర్మాణం జరిగిందని, 700 మంది వరకు ఇక్కడ ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాగంటి ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యాగంటి దుర్గా ప్రసాద్‌రావు, రిసార్ట్ డైరెక్టర్ కన్యాదర రవీంద్రబాబు పాల్గొన్నారు. వర్చువల్ గా జరిగిన రిస్టార్ట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి. గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు

వీణా అవార్డ్సు నాటకోత్సవాల ప్రారంభం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సాహిత్య సంస్థ కళల కాణాచి, ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన వీణా అవార్డ్స్ 2025 నాటకోత్సవాలు శనివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సభకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆలపాటి మాట్లాడుతూ, కళా వైభవానికి తెనాలి కళాభిమానులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కళలకు, కళాకారులకు నిలయమైన తెనాలి పట్టణంలో ప్రతి ఏటా వారం రోజుల పాటు నాటకోత్సవాలను ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నిర్వహిస్తున్నారని చెప్పారు. నాటకోత్సవాలను రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మీ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కూచిపూడి కళాకారిణి వెంకటలక్ష్మీ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో నాటక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన మూడు నాటకాలు కళాభిమానులను అలరించాయి. కర్నూలు టీజీవీ కల్చరల్ అకాడమీ కళాకారులు శ్రీ వేంకటేశ్వర మహత్యం పద్య నాటకం ప్రదర్శించారు. శారదా ప్రసన్న రచించిన నాటకానికి రమణారెడ్డి దర్శకత్వం వహించారు. అనంతపురం లలిత కళా పరిషత్ కళాకారులు కాలభైరవ సంహారం పద్యనాటకం ప్రదర్శించారు. పోతులయ్య రచించిన ఈ నాటకానికి శ్రీరామగోవిందసాగర్ దర్శకత్వం వహించారు. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ కళకారులు ప్రదర్శించిన నల్లత్రాచునీడలో సాంఘిక నాటకాన్ని పి.శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించారు. నాటిక నిర్వాహకులకు కమిటీ అధ్యక్షుడు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ ప్రదర్శన పారితోషికాలు అందజేశారు. కాగా, వీణా అవార్డ్స్ నాటకోత్సవాలతో రూపొందించిన విపంచి పుస్తకాన్ని ఆవిష్కరించారు. డబుల్ హార్స్ సంస్థ ఎండీ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్, నాటక రచయిత మృత్యుంజయరావు, రంగస్థల కళాకారుల సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మీ, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, చెరుకుమల్లి సింగారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



విపంచి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, సాయిమాధవ్ తదితరులు

విద్యార్థిని మృతి కేసును సీబీఐకి అప్పగించండి

● గుంటూరు ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ పాలిటెక్నిక్ విద్యార్థిని మృతి ఘటనకు సంబంధించి 2017లో గుంటూరు, నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో దాఖలైన కేసు దర్యాప్తులో పురోగతి లేకపోవడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. విద్యార్థిని మృతి విషయంలో పోలీసులు పరస్పర విరుద్ధ వివరాలను కోర్టు ముందు ఉంచడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడమే సముచితమని అభిప్రాయపడింది. సీబీకి ఆదేశాలు ఇచ్చే ముందు కేసు దర్యాప్తు పురోగతిపై వాస్తవాలు పేర్కొంటూ అఫిడవిట్ వేయాలని గుంటూరు జిల్లా ఎస్పీని ఆదేశించింది. కేసుపై తదుపరి విచారణను అక్టోబర్ 6కి వాయిదా వేసింది. గుంటూరు జిల్లా గోపాయపాలెంకు చెందిన గర్నెపూడి శ్రావణ సంధ్య (17) బుడంపాడులోని ఓ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతూ 2017లో అనుమానాస్పద రీతిలో మృతిచెందింది. శ్రావణ సంధ్య హాస్టల్‌లోని 4వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందిందని హాస్టల్ వార్డెన్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. ఈ ఘటనపై గుంటూరు జిల్లా, నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఆధారంగా పరిశీలిస్తే వసతి గృహం నాలుగో అంతస్తు నుంచి యువతి ప్రమాదవశాత్తు పడిపోయిందని, ఆ సమయంలో ఎవరూ లేరని పోలీసులు కోర్టు ముందు ఉంచిన వివరాలలో పేర్కొన్నారని గుర్తు చేసింది. అయితే తన కుమార్తెను హత్య చేశారని, పోలీసులు కేసును సక్రమంగా దర్యాప్తు చేయడం లేదని పేర్కొంటూ మృతురాలి తల్లి హైకోర్టును ఆశ్రయించారు. ఘటనపై సీఐడీ లేదా సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా పోలీసులు సమర్పించిన వివరాలను పరిశీలించారు. విద్యార్థిని మృతి విషయంలో పరస్పర విరుద్ధ వివరాలను కోర్టు ముందు ఉంచడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.

పెదకాకాని మల్లేశ్వరుని దర్శించిన మంత్రి సుభాష్

పెదకాకాని, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవ స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం దర్శించారు. ఆలయ అధికారులు, అర్చకస్వాములు, వేదపండితుల వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాలతో ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం కుంకుమ పూజలు, రాహుకేతు పూజలలో మంత్రి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయన్ను సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని, చిత్ర పటాన్ని అందజేశారు. దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ ఎస్ ఎస్. చంద్రశేఖర అజాద్ దంపతులు శ్రీ స్వామి, అమ్మవార్లను శనివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. మల్లేశ్వర స్వామికి, భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

తెలీదు.. గుర్తులేదు.. సంబంధం లేదు

పోలీసుల విచారణలో పిన్నెల్లి సోదరుల సమాధానం

మాచర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం, గుండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జవిశెట్టి సోదరుల జంట హత్య కేసులో నిందితులైన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలు శనివారం జరిగిన పోలీసుల విచారణలో మాకు తెలీదు.. గుర్తులేదు.. సంబంధం లేదు.. అనే సమాధానాలిచ్చారు. మాచర్ల సర్కిల్ కార్యాలయంలో విచారణ అధికారి మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, గురజాల డీఎస్పీ జగదీష్ సమక్షంలో పిన్నెల్లి సోదరులు హైకోర్టు న్యాయవాదులు మనోహర్‌రెడ్డి, రామలక్ష్మారెడ్డిలతో కలిసి విచారణకు హాజరయ్యారు. ఉదయం 10:30 గంటలకు సర్కిల్ కార్యాలయానికి చేరుకోగా రాత్రి 9 గంటల వరకు విచారణ కొనసాగింది. ముందుగా మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని విచారించారు. అనంతరం సాయంత్రం అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిని ప్రశ్నించారు. ఇరువురు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితులతో మాట్లాడినట్లు గుర్తించిన పోలీసులు దానిపై ప్రశ్నించినా ఆ ఫోన్లు మేము వాడలేదు.. ఎవరు వాడారో మాకు తెలీదు అంటూ సమాధానాలిచ్చారు. విచారణ అనంతరం పోలీసులు రాత్రి 9 గంటలకు పిన్నెల్లి సోదరులను సర్కిల్ కార్యాలయం నుంచి పంపించారు. పోలీసులు ఇచ్చిన నోటీసుల మేరకు విచారణ ముగిసినప్పటికీ ఈ కేసులో మరింత సమాచారం కోసం మరోసారి పిన్నెల్లి సోదరులను విచారణకు పిలిచే అవకాశం లేకపోలేదు.

రైల్వేట్రాక్ పెట్రోలింగ్ కట్టుదిట్టం


● నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంచారం పెరగడంతో ఒక్కో టీంలో ముగ్గురు కార్మికులు
● సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక పరికరాలు

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో రైల్వే సిబ్బందికి విధులు నిర్వహించడమంటే కత్తి మీద సాములాంటిదే. సింగిల్ ట్రాక్ మాత్రమే ఉన్న ఈ ఘాట్ సెక్షన్‌లో వన్యప్రాణుల సంచారం అధికంగా ఉంటుంది. పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు వంటివి హఠాత్తుగా ట్రాక్ పైకి వచ్చేస్తుంటాయి. ఇటీవలకాలంలో రైలు ఢీకొని వన్యప్రాణులు మృతి చెందిన ఘటనలు కూడా చోటు చేసుకొన్నాయి. ఇదే సమయంలో ట్రాక్‌పై ముఖ్యంగా రాత్రి వేళ విధులు నిర్వహించే సిబ్బందికి ఆయా జంతువులు తారసపడ్డాయంటే ఇబ్బందికరమే. ఈ పరిస్థితిని అధిగమించేందుకు డివిజనల్ రైల్వే అధికారులు ఒకరిద్దరిని కాకుండా రాత్రివేళ పెట్రోలింగ్ డ్యూటీలో ముగ్గురిని పంపాలని నిర్ణయించారు. దీని వల్ల సిబ్బంది భద్రత పెరుగుతుందని అధికారులు తెలిపారు. దిగువమెట్ట-చలమ మధ్యన 16 కిలోమీటర్ల రైలు మార్గం నల్లమల అటవీ ప్రాంతంలో నుంచి ఏర్పాటై ఉంది. దీనిని మూడు విభాగాలుగా చేసి సిబ్బందికి డ్యూటీలు వేశారు. రాత్రి వేళ డ్యూటీకి వెళ్లే సిబ్బంది కచ్చితంగా రెట్రో రిఫ్లెక్ట్ జాకెట్లు ధరిస్తారు. అలానే జంతువులు కొంచెం దూరంలో కనిపించగానే డ్రమ్ములు, తంబూరాలు వాయిస్తారు. అలానే టపాసులు పేలుస్తారు. కాగడాలు వెలిగించడం వంటివి చేసి బెదరగొడతారు. ఉదయం షిఫ్టులో ఇద్దరు కార్మికులు విధులు నిర్వహిస్తారు. వీళ్లు కూడా ఆయా పరికరాలను కలిగివుంటారు.

రైళ్ల రాకపోకలు సురక్షితంగా సాగేందుకే..

● రైల్వే ప్రజాసంబంధాల అధికారి

రైళ్ల రాకపోకలు సురక్షితంగా సాగేందుకు, ప్రయాణికుల భద్రతకు వీలుగా ఈ మార్పులు చేసినట్లు రైల్వే ప్రజాసంబంధాల అధికారి డీ వినయ్‌కాంత్ తెలిపారు. వర్షాకాలంలో హఠాత్తుగా వాగులు పొంగి నీరు రైలుమార్గాలపైకి వచ్చేస్తుంటుంది.ఆ సమయంలో ట్రాక్ దెబ్బతినే అవకాశం ఉందన్నారు. 24 గంటల పెట్రోలింగ్ డ్యూటీల వల్ల ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే రైళ్లను నిలిపేసి మరమ్మతులు చేయించడానికి వీలు కలుగుతుందన్నారు. అలానే రాబోయే శీతాకాలంలో దట్టమైన పొగమంచు వల్ల కూడా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకొంటున్నామన్నారు.



నల్లమల అటవీ ప్రాంతంలో రైలుమార్గంపై రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది



ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బంది

గుమ్మడి.. లాభాల జడి..!

ఆశాజనకంగా ధరలు

టన్ను కాయలు రూ. 12 వేల నుంచి రూ.15 వేలకు

అమ్ముకొనేందుకు రైతుల ఆసక్తి



హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న మంచి గుమ్మడి కాయలు

బల్లికురవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పది రోజుల క్రితం వరకు ధరలు లేక గుమ్మడి సాగు చేసిన రైతులు విలవిలలాడారు. విజయదశమి పర్వదినం దగ్గర పడడంతో ధరలు పెరిగాయి. దీంతో రైతులు గుమ్మడిని అమ్మకాలు చేసేందుకు పరుగులు పెడుతున్నారు. దీంతో ధరలు ఎక్కడ తగ్గుతాయోనని రైతులు కోతలు, అమ్మకాలలో వేగం పెంచారు.

బల్లికురవ మండలం కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, ఎస్ఎల్.గుడిపాడు, వెలమవారిపాలెం, నక్కబొక్కలపాడు, బల్లికురవ, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, రామాంజనేయపురం, కొణిదెన, గంగపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరు, కోటవారిపాలెం, కొప్పెరపాలెం గ్రామాలలో రైతులు ఈ ఏడాది మంచి గుమ్మడి (ఎర్రకాయలు)ను సుమారు వంద ఎకరాల్లో సాగు చేశారు. మొదట్లో టన్ను కాయల ధర రూ.6వేలు ఉంది. ప్రస్తుతం విజయదశమి పండగకు హైదరాబాద్, ఇతర పట్టణాల్లో గిరాకీ పెరిగింది. రెండు రోజుల నుంచి టన్ను రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నారు. కొందరు రైతులు నేరుగా హైదరాబాద్ మార్కెట్‌కు లారీలను పెట్టుకొని కాయలను తీసుకు వెళ్లి అమ్మకాలు చేస్తున్నారు. కొందరు చిరు వ్యాపారులు రైతుల వద్ద టన్ను రూ.12 వేలకు కొనుగోలు చేసి అమ్మకాలు చేసుకుంటున్నారు. ఇదే ధర ఉంటే పెట్టుబడిపోను ఎకరాకు రూ.40 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు ఐదు టన్నుల మేర దిగుబడి వస్తుందని, పెట్టుబడి కూడా గుమ్మడి సాగుకు తక్కువేనని రైతులు అంటున్నారు.



మొత్తం మీద కోతలు కోసే సమయానికి ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు తెలిపారు. బూడిద గుమ్మడి ధరలు టన్ను రూ.5 వేల వరకు మాత్రమే ఉండడంతో బూడిద గుమ్మడి సాగు నష్టాలను తెచ్చి పెట్టిందని రైతులు వాపోతున్నారు.

వలపర్లలో చోరీ

● టీచర్ ఇంట్లో 50 సవర్ల బంగారం అపహరణ



ఉపాధ్యాయ దంపతులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

మార్టూరు, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్లలో ఉపాధ్యాయుని ఇంటిలో భారీ చోరీ చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కె.కొండలరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దాదాపుగా 50 సవర్లుకు పైగా బంగారాన్ని దొంగలు ఎత్తుకుపోయారని ఉపాధ్యాయుని బంధువులు తెలిపారు. వలపర్ల గ్రామంలో సాయిబాబా గుడివెనుక కాలనీలో నివసించే కొండలరావు, నాగిని దంపతులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరిలో కొండలరావు జె.పంగులూరు మండలంలోని కొండమంజులూరులోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా, భార్య నాగిని వలపర్ల జడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అయితే వారిద్దరూ ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలో గంగావతిలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. వారు శనివారం సాయంత్రం వలపర్ల గ్రామంలోని ఇంటికి వచ్చి చూడగా ఇంటి ప్రధాన తలుపులు తాళం పగల గొట్టి ఉంది. బీరువా తలుపులు తెరచి ఉండడాన్ని వారు గమనించారు. అనంతరం బీరువాలోని బంగారం కూడా లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దాంతో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, సంతమాగులూరు సీఐ వెంకటరావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉపాధ్యాయుల దంపతులతో మాట్లాడారు. కాలనీకి చివర్లో సింగిల్‌గా ఇల్లు ఉండడంతో దొంగలు సులువుగా చోరీ చేశారని గ్రామస్థులు పోలీసులు భావిస్తున్నారు. అయితే దొంగతనం రెండు రోజుల క్రితం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. క్లూస్ టీం వస్తుందని పోలీసులు తెలిపారు. మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి జరిగిన తీరును విచారించారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో వల్లూరమ్మ

లలితా త్రిపురసుందరీదేవిగా వల్లూరమ్మ

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరోరోజైన శనివారం వల్లూరమ్మ తల్లి లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో బి.రమేష్ పర్యవేక్షించారు.

కామేపల్లిలో...

జరుగుమల్లి మండలం కామేపల్లిలోని శ్రీపోలేరమ్మ శనివారం లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బైరాగిచౌదరి పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జాలమ్మతల్లి దేవస్థానంలోని అమ్మవారు శనివారం లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారిని సుందరమైన పుష్పాలతో అలంకరించారు. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన బాల భక్తి నీరాజనం



దేవీదేవతల సంకీర్తనలను ఆలపిస్తున్న చిన్నారులు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి పలువురు చిన్నారులు అమ్మవారికి సమర్పించిన భక్తినీరాజనం శాస్త్రీయ సంగీత కార్యక్రమం భక్తులను విశేషంగా అలరించింది. స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరంలో శ్రీ రాఘవ కూచిపూడి నృత్య, సంగీత కళానిలయం చిన్నారులు ఆలపించిన పలు భక్తిగీతాలు రసరమ్యంగా కొనసాగాయి. విఘ్నేశ్వరుని ప్రార్థనతో ఆరంభించి శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, అమ్మవారు మొదలైన దేవీదేవతల సంకీర్తనలను చిన్నారులు హృద్యంగా ఆలపించారు. కళానిలయం నిర్వాహకురాలు కరవది సాయిశరణ్య నిర్వహణలో కొనసాగిన ఈ కార్యక్రమంలో తబలాపై కొత్తపల్లి శ్రీనివాస్, వయోలిన్‌పై చావలి శ్రీనివాస్‌లు వాద్య సహకారాన్ని అందజేశారు. స్థానిక కేశవస్వామిపేట ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంత్రిప్రగడ నరసింహా రావు కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ప్రముఖ ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు శక్తిపీఠాల ఔన్నత్యాన్ని వివరించారు.

ఆత్మీయంగా పలకరించుకుంటూ.. ఆనందాలు పంచుకొంటూ..

హైదరాబాద్‌లో వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశం



హైదరాబాద్‌లో సమావేశమైన పూర్వవిద్యార్థులు

చీరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గురువుల మందలింపు, స్నేహితులతో ఆటపాటలు, కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలనాటి జ్ఞాపకాలు అతి మధురమని కర్నాటక రాష్ట్ర తాగునీరు సరఫరా ప్రతినిధి కామేపల్లి భూపాల్, ఖమ్మం స్టడీ సర్కిల్ కామర్స్ అకాడమీ చైర్మన్ జీవీ నరసింహారావు అన్నారు. శనివారం హైదరాబాదులో వీఆర్ఎస్ వైఆర్ఎన్ కళాశాల 1983-85 ఎంకామ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశవిదేశాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడి కళాశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకరిస్తామన్నారు. కుటుంబ సభ్యులతో హాజరై నాటి మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌వీ బ్రహ్మయ్య, హరినాథ్‌బాబు, లక్ష్మీదేవీ, వెంకటేశ్వర్లు, బడేసాహెబ్, తదితరులు పాల్గొన్నారు. వీరంతా చీరాల, బాపట్ల, వేటపాలెం, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, తదితర ప్రాంతాలకు చెందిన వారు కావడం విశేషం.

మెప్మా ఆధ్వర్యంలో ముగ్గుల ప్రదర్శన



ముగ్గులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హే సేవా-2025లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మెప్మా సిబ్బంది ముగ్గుల ప్రదర్శన, ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేశారు. రంగు రంగుల ముగ్గులను తిలకించారు. వివిధ రకాల వంటకాలను రుచి చూశారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీం ద్ర, స్వచ్ఛ ఆం ధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, మేనేజర్ శ్రీదేవి, టీపీవో లక్ష్మీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, మెప్మా సీఎంఎం సత్యవతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపాలెంలో స్వచ్ఛతా సేవా ర్యాలీ

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చ క్రాయపాలెంలో శనివారం స్వచ్ఛతాసేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, మండల టీడీపీ అధ్యక్షుడు గోగులమూడి రాజశేఖర్, గ్రామపార్టీ అధ్యక్షుడు రాయుడు నరేం ద్రబాబు, మలిపెద్ది రవీంద్ర, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారం కోసమే రీసర్వే

అద్దంకి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టిందని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. మండలంలోని మణికేశ్వరం, నన్నూరపాడులలో మూడవ విడత రీసర్వేను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో గ్రామసభలు, ర్యాలీ లు నిర్వహించి రీ సర్వే పై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమాలలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మస్తాన్‌రావు, ఆర్ఐ శంకర్, సర్వేయర్ శ్రీలక్ష్మీ, వీఆర్‌వోలు, టీడీపీ నేతలు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

● డీపీవో వెంకటేశ్వరరావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

సింగరాయకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మూలగుంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.జయమణి, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.రమేష్‌బాబు, ఎంఈవో కత్తి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పొన్నలూరు సర్వసభ్య సమావేశం

పొన్నలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

అర్ధరాత్రి పోలీసుల స్పెషల్ డ్రైవ్



బస్టాండ్ వద్ద అపరిచితులను విచారిస్తున్న సీఐ సుబ్బారావు, సిబ్బంది

మార్కాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాల మేరకు మార్కాపురం పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని అన్ని లాడ్జీలను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. కొత్త వ్యక్తులు, అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద అపరిచిత వ్యక్తులను విచారించారు. మోటార్ సైకిళ్లపై తిరుగుతున్న వారిని ఆపి పత్రాలను పరిశీలించారు. పలుచోట్ల యువకులు మద్యం సేవించి వీధుల్లో తిరుగుతున్నట్లు గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

లక్ష్య సాధనవైపు దృష్టి సారించాలి

● మార్కెట్ యార్డ్ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత

● ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న గుంజి వెంకట్రావు

పర్చూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : లక్ష్య సాధనవైపు దృష్టి సారించి, పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి పదంలో నిలిపే విధంగా పాలక మండలి దృష్టి సారించాలని పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. శనివారం స్థానిక ఏఎంసీలో నూతన పాలక మండలి తొలి సమావేశం జరిగింది. పరిచయ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆకాంక్ష మేరకు రైతులకు మెరుగైన సేవలు అందించే విధంగా మార్కెట్‌యార్డ్ సేవలను విస్తరించాలన్నారు. మిర్చి కొనుగోలు కేంద్రాలు పర్చూరు, ఇంకొల్లు నందు ఏర్పాటు చేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అదేవిధంగా మార్టూరు కూరగాయల యార్డ్‌లో వ్యర్థాల కోసం యార్డ్ పరిధిలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి రైతులకు వర్మీకంపోస్టు ఎరువు ఉపయోగ పడేలా చూడాలని సభ్యులు తీర్మానించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శంకరశెట్టి చిరంజీవి, యార్డ్ కార్యదర్శి ఓటీయస్ ప్రసాద్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే రీ సర్వే

చినగంజాం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని రైతులకు భూ సమస్యలు లేకుండా పరిష్కరించేందుకే రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడారు. రీసర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ అన్నారు. చినగంజాం గ్రామ రెవెన్యూ పరిధిలో రీసర్వే జరిగేటప్పుడు రైతులు తమ హక్కు పత్రాలు, ఆధార్, ఫొటోలతో వచ్చి తమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సుజాత, మండల సర్వేయర్ లోకేష్, గ్రామ రెవెన్యూ అధికారులు బండారు దానియేలు, ఆమంచి సత్యనారాయణ, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు ట్రైస్కూటీల అందజేత



పంపిణీకి సిద్ధంగా ఉన్న స్కూటీలు

అద్దంకి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు 35 ట్రై స్కూటీలను ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దివ్యాంగులకు ఆదివారం పంపిణీ చేయనున్నారు. అద్దంకి పట్టణ, మండల పరిధిలో ఉన్న 35 మంది దివ్యాంగులకు ఒక్కొక్కటి 1.40 లక్షల రూపాయల విలువైన స్కూటీ లను అందజేయనున్నారు. ఉదయం 10 గంటలకు అద్దంకి పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా ఉత్సవాల పూజలలో మంత్రి రవికుమార్ పాల్గొంటారు. అనంతరం 10:30 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద దివ్యాంగులకు ట్రై స్కూటీ ల పంపిణీ లో పాల్గొననున్నారు.

అద్భుతంగా ఆర్టీసీ

(7వ పేజీ తరువాయి)

తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చి పనులను చేపడుతున్నాయి. సీడ్‌యాక్సిస్ రోడ్డు వెంబడే తమకు భూములు కేటాయించాలని మరికొన్ని సంస్థలు ప్రభుత్వపెద్దలపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ క్రమంలో రాజధానిలో బస్‌స్టేషన్ల ఏర్పాటుకు 165 ఎకరాలను కేటాయించాలని ఏపీఎస్‌ఆర్టీసీ సీఆర్‌డీఏకు విన్నవించుకుంది. ఈ మేరకు ఆ సంస్థ ఎండీ ఈ ఏడాది జూన్‌లోనే లిఖితపూర్వక విజ్ఞాపనపత్రాన్ని సీఆర్‌డీఏకు అందజేసి, ఆ విషయాన్ని ప్రభుత్వపెద్దల దృష్టికి కూడా తీసుకెళ్లారు. రాజధాని అమరావతి నగరంలో తిరిగే సిటీ సర్వీసులన్నీ పూర్తిగా ఎలక్ట్రికల్ లేదా, బ్యాటరీ వాహనాల రూపంలోనే ఉంటాయి. దీనివలన అమరావతిలో కాలుష్యం గణనీయంగా తగ్గనున్నది. ఆర్టీసీ నుంచి మూడు నెలల క్రితం సీఆర్‌డీఏకు ఈ ప్రతిపాదనలు అందినప్పటికీ ఎందువలనో ఆ సంస్థకు భూ కేటాయింపులు చేయలేదు. ఆర్టీసీకి భూ కేటాయింపులు, బస్‌స్టేషన్లు, డిపోల ఏర్పాటు తదితరాలన్నీ కూడా రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉండే అంశాలే కాబట్టి.. ప్రభుత్వం ఒకింత జాప్యం చేస్తుండవచ్చని భావించాలి.

మూడు టెర్మినల్స్.. తొమ్మిది బస్‌స్టేషన్లు

నవ నగరాల్లో ఎక్కడికక్కడ అంటే బస్‌స్టేషన్, దానికి అనుబంధంగా డిపోను ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ఒక్కో నగరంలో బస్‌స్టేషన్‌కు ఐదెకరాలు, డిపోకు ఇంకో ఐదెకరాలు.. వెరసి ఒక్కోచోట పదెకరాల చొప్పున నవనగరాల్లో కలిపి 90 ఎకరాలను కేటాయించాలని ఆర్టీసీ కోరుతుంది. నగరానికి మూడు వైపులా మూడు భారీ ఇంటర్‌ఛేంజ్ టెర్మినల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఒక్కో టెర్మినల్స్ కోసం 25 ఎకరాల వంతున మూడు టెర్మినల్స్‌కు కలిపి 75 ఎకరాలు అవసరమని ఆర్టీసీ భావిస్తుంది. ఈ టెర్మినల్స్‌లో సుదూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు దిగి అక్కడి నుంచి సిటీ సర్వీసులను వినియోగించుకుని రాజధాని నగరంలో తాము వెళ్లాల్సినచోటుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు.

- హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం రాయపూడి సమీపంలో ఓ టెర్మినల్
- బెంగళూరు, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం నీరుకొండ, పెదపరిమి మధ్య ఓ టెర్మినల్
- ఉత్తరాంధ్ర, రేపల్లె ప్రాంతాల నుంచి వచ్చేవారి కోసం మంగళగిరి పశ్చిమశివారులో మరో టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ప్రతిపాదిస్తోంది.

స్థానిక సంస్థలకు మొండిచేయి!

(7వ పేజీ తరువాయి)

పరిషత్‌లకు విభజించి ఖాతాలకు జమ చేస్తారు. ఇక పట్టణ పరిధిలో ఆస్తుల క్రయవిక్రయాల సర్‌చార్జి మొత్తం మునిసిపాలిటీ ఖాతాకే జమ చేస్తారు. ఒక్క నరసరావుపేట మునిసిపాలిటీకి ఏడాదిగా సర్‌చార్జి నిధులు రూ.7 కోట్లు విడుదల కావాల్సి ఉంది.

నిధుల లేమితో..కునారిల్లుతున్నాయి

నిధుల లేమితో కొన్ని మునిసిపాల్టీల్లో జీతాలు సకాలంలో చెల్లించలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రేషన్ సర్‌చార్జికి సంబంధించిన ప్రొసీడింగ్స్ ఖజానాకు పంపించకుండా రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆదేశించినట్లు సమాచారం. మళ్లీ ఆదేశాలు ఇచ్చే వరకు ప్రొసీడింగ్స్ నిలుపుదల చేయాలని ఆదేశించారు. సర్‌చార్జి నిధుల కోసం స్థానిక పాలక వర్గాలు, అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నిధులు జమ కావాలంటే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. ప్రభుత్వ అదేశాల వస్తే ప్రొసీడింగ్స్‌ను పంపుతామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఎప్పటికి కరుణిస్తుందోనని సదరు పాలకవర్గాలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నాయి.

ఘనంగా పల్లపువారి కొలుపులు

బల్లికురవ, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినఅంబడిపూడి గ్రామంలోని పల్లపు వంశస్థుల రేణుకమ్మ అంకమ్మ తల్లి కొలుపులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారంతో కొలుపులు ముగుస్తాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా అంకమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక అలంకరణ చేశారు. దీంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామ పరిసర గ్రామాలలో ఉన్న పల్లపు వంశస్థులు అంబడిపూడి గ్రామంలోని దేవాలయానికి చేరుకున్నారు.

రెవెన్యూ క్రీడలను జయప్రదం చేయాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్‌బాబు

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు10, 11 తేదీలలో బాపట్లలో జరిగే జిల్లాస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని రెవెన్యూ అసోసియేష్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు కోరారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో జరిగిన కార్యక్రమంలో బ్రోచర్ ను ఆవిష్కరించారు. వీఆర్ఏ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు అందరు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అద్దంకి, సంతమాగులూరు, పగులూరు మండలాల తహసీల్దార్లు శ్రీచరణ్, రవిబాబు, సింగారావు, డివిజన్ అధ్యక్షులు గోపికృష్ణ, కార్యదర్శి పీకా సురేష్, జిల్లా క్రీడల కార్యదర్శి అర్జున్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ, శ్రీకాంత్, రామకృష్ణ, ఆర్ఐ శంకర్, ఏఎస్‌వో అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీయం పుస్తక ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన చంద్రమౌళీయం పుస్తకం అరుదైనదని ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం జానపద కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీ కన్వెన్షన్‌లో జ్యోతి చంద్రమౌళి రచించిన చంద్రమౌళీయం వజ్రోత్సవ సంచిక ఆవిష్కరణ కార్యక్రమం డాక్టర్ యు.దేవపాలన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జ్యోతి చంద్రమౌళి రాసిన పుస్తకాలు ఏదో ఒక కొత్త విషయాన్ని సమాజానికి తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా రచయిత జ్యోతి చంద్రమౌళి దంపతులను సభ్యులు, అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మద్రాసు విశ్వ విద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు విస్తాలి శంకరరావు, డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, బీరం సుందరరావు, జ్యోతి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పైరుకు సరిపడా అందుబాటులో యూరియా

బల్లికురవ, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడిన యూరియాను ప్రభుత్వం రైతుసేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచిందని నక్కబొక్కలపాడు నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి తెలిపారు. శనివారం ప్రభుత్వం నుంచి రైతుసేవా కేంద్రానికి వచ్చిన యూరియాను అయన దగ్గర ఉండి రైతులకు పంపిణీ చేశారు. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని అందరికీ, యూరియాను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దూళిపాళ్ల పూర్ణయ్య, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబరు 1న మెగా వైద్యశిబిరం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్వస్థ్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అక్టోబరు 1న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. వాహిల చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో చెవి, ముక్కు, గొంతు, మానసిక రుగ్మతలు, చర్మవ్యాధులు, సాధారణ వ్యాధులు, చిన్న పిల్లలకు సంబంధించిన వ్యాధులు, గర్భిణులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. అద్దంకి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొని రక్తదానం చేయాలని ఆమె కోరారు.

భూసమస్యలు లేకుండా సర్వే చేయించుకోవాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

బల్లికురవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాలలో భూమస్యలు లేకుండా భూసర్వే చేయిస్తోందని రైతులు దగ్గర ఉండి సర్వే చేయించుకోవాలని తహసీల్దార్ రవినాయక్ కోరారు. శనివారం మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో భూసర్వేపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని భూములను ప్రత్యేకసర్వే బృందాలు సర్వే చేస్తాయని రైతులు తమ వద్ద ఉన్న హక్కు పత్రాలను వారికి చూపించి కొలతలు వేయించుకోవాలన్నారు. రీసర్వే పూర్తి అయితే రైతుల మధ్య ఉన్న సమస్యలు కూడా తొలగి పోతాయన్నారు. ఈ ర్యాలీలో డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష, ఆర్ఐ పోతురాజు గ్రామ టీడీపీ నాయకులు కోట శ్రీను, గ్రామ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి

- కంటి వైద్యులు డాక్టర్ శ్రద్ధాలాజర్

పంగులూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కంటి సంరక్షణలో ప్రతి వ్యక్తి తగిన జాగ్రత్తలు పాటించాలని నేత్రవైద్య నిపుణులు డాక్టర్ శ్రద్ధాలాజర్ సూచించారు. పంగులూరులో శనివారం రోటరీక్లబ్, పెద్దకాకానికి చెందిన శంకర్‌నేత్రాలయం సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తులవీరనారాయణ ప్రారంభించారు. ఈ శిబిరంలో 35 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 16 మందికి శుక్లం ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. వీరికి 28వ తేదీన శంకర్ నేత్రాలయంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బత్తుల వీరనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు బాచిన చెంచుప్రసాద్, క్లబ్ ప్రతినిధులు షేక్‌కాలేషావలి, వీరరాఘవయ్య, ఐ.సుబ్బారావు, కరణంహనుమంతరావు, సీతారామయ్య, పీఆర్‌వో సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

- వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులకు ప్రభుత్వ రుణాలు

చీరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వీధి విక్రయిదారులు, చిరు వ్యాపారులు ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు సాగాలని మెప్మా సిటీమిషన్ మేనేజర్ చినకొండయ్య చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెప్మా విభాగం నుంచి 5 వేల మందికి రుణాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీని కోసం వ్యాపారులు వెంటనే మెప్మా కార్యాలయాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వీరికి అక్టోబరు 1న బాపనమ్మ కల్యాణ మండపంలో రుణమేళా నిర్వహించనున్నట్లు మేనేజర్ తెలిపారు.

ఉపాధి పనులను బాధ్యతతో నిర్వహించండి

- క్షేత్ర సహాయకులతో ఏపీడీ సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ సింగయ్య

బల్లికురవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఉపాధి హమీ పథకం పనులను బాధ్యతగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని ఏపీడీ బత్తిన సింగయ్య హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల క్షేత్రసహాయకులు, కార్యాలయ సిబ్బందితో ఏపీడీ సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది లేబర్ బడ్జెట్‌లో కేటాయించిన కూలీలు వైదన, చెన్నుపల్లి, కొప్పెరపాడు, వెలమవారిపాలెం, ముక్తేశ్వరం, చెన్నుపల్లి గ్రామాల నుంచి తక్కువ మంది వచ్చారని వెంటనే అయా గ్రామాలలో కూలీల సంఖ్య పనులకు పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అలానే హార్టీకల్చర్ ద్వారా పండ్ల మొక్కలు నాటించాలన్నారు. సోక్‌పిట్లను వెంటనే నిర్మాణం చేయించాలన్నారు. ఇప్పటికే బల్లికురవ మండలంలో పనులలో అవకతకవలు జరిగిన్నట్లు సామాజిక తనిఖీలో వెల్లడైందని బాధ్యతగా పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి రోజు రెండు సార్లు కూలీల ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఎవరైన నిర్లక్ష్యంగా ఉంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.. అన్ని గ్రామాలలో వెంటనే పనులు చేయించాలన్నారు. పంట కాలువలను అభివృద్ధి పరచాలన్నారు. ఈ సమీక్షలో ఎంపీడీవో కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీగా రామకోటయ్య బాధ్యతల స్వీకరణ

అద్దంకి, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): అద్దంకి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జీ కోర్టులలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా బత్తుల రామకోటయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు రామకోటయ్యను అభినందించారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపు కు ఆదివారం అద్దంకి, మార్టూరులలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయం లలో కౌంటర్ లు తెరిచి ఉంటాయని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు మున్సిపల్ సమావేశం

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమీషనర్ రవీం ద్ర తెలిపారు.

నేడు సృజన సాహిత్య సమావేశం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సృజన సాహిత్య సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిన కమతేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కే.అనీలకుమారసూరి, గాడేపల్లి దివాకర్‌దత్తు ప్రసంగిస్తారన్నారు. అనంతరం ప్రముఖ నటులు వర్మం సీతారామశాస్త్రీ భస్మాసుర ఏకపాత్రాభినయం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా శరన్నవరాత్రి వేడుకలు

- లలితా త్రిపురసుందరిగా అమ్మవారి అలంకారణ
- కుంకుమ పూజలు, సహస్రనామ పారాయణం చేసిన మహిళలు

అద్దంకి,సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని శనివారం గజలక్ష్మిగా అలంకరించారు. దత్తపాదుకా క్షేత్రం, వేయిస్తంభాలగుడి, పోలేరమ్మ దేవాలయాల్లో కూడా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

బల్లికురవ : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో పోలేరమ్మ దేవాలయంలో దసరా నవరాత్రి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పోలేరమ్మ తల్లి శనివారం లలిత త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అలానే కొత్తపాలెం, వేమవరం, మల్లాయపాలెం, కొప్పెరపాడు గ్రామాలలో నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు..

పంగులూరు : మండలంలోని రేణంగివరంలోని త్రిశక్తి పీఠం, ముప్పవరంలోని శ్రీలక్ష్మీగణపతిషిర్డీసాయి ఆలయంలో శనివారం అమ్మవారిని శ్రీలలితా త్రిపురసుందరిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా కుంకుమపూజలు చేశారు. చందలూరులోని చిట్టా బత్తినవారి రేణుకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని శ్రీలలితాత్రిపురసుందరిదేవిగా అలంకరించి లలితా అష్టోత్తర నామపారాణం చేశారు.

పర్చూరు : శ్రీలలిత త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు శనివారం భక్తులకు దర్శనమిచ్చారు స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు.

మేదరమెట్ల : దసర పండుగ సందర్భంగా మండలంలోని పలు దేవాలయాలల్లో అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం మేదరమెట్లలోని మిద్దెల డొంకలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బాల త్రిపుర సుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలరావూరులోని ఉ మమహేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో దసర పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంకొల్లు : మండలంలోని దుద్దుకూరు గ్రామంలోని శ్రీచెన్నుపాటివారి అంకమ్మతల్లి దేవర గుడిలో శ్రీదేవీశరన్నవ రాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తు న్నారు. వేడుకలలో భాగంగా శనివారం అంకమ్మతల్లి అమ్మవారిని శ్రీలలితా త్రిపురసుందరిదేవి రూపంలో ప్రత్యేకంగా అలంకరించా రు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం, కుంకుమపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక భక్తబృందం అమ్మవారిని స్తుతిస్తూ భజనలు చేశారు.

ఇంకొల్లు : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా 6వ రోజు ఇంకొల్లు మండలంలోని దుద్దుకూరు శివాలయంలో అమ్మవారిని లలితత్రిపుర సుందరిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంకొల్లులోని రేణుకమ్మ అలయంలో దసరా సందర్భంగా అమ్మవారికి లలితా త్రిపురసుందరిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసారు.

చినగంజాం : స్థానిక భూ సమేత భావనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవస్థానంలో శనివారం ఉదయం శ్రీవారికి విశేష పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. మహిళా భక్తులు విష్ణుసహస్ర నామ స్తోత్రపారాయణాన్ని నిర్వహించి, తదనంతరం వసంతోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఆశ్వవాహనంపై భావనారాయణస్వామి ఉంచి భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారికి చక్రస్నానం నిర్వహించి, నిత్యహోమం, పూర్ణాహుతి జరిపి భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ, సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా మండల పరిధిలోని గ్రామాల్లోని ఆలయాల్లో వివధ రూపాల్లో అమ్మవార్లను అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పలుచోట్ల అన్నప్రసాద వితరణ చేశారు.



ఇంకొల్లు మండలం దుద్దుకూరులో లలితాత్రిపుర సుందరిగా అంకమ్మ దేవర, రేణింగవరం త్రిశక్తిపీఠంలో అమ్మవారి అలంకరణ






బల్లికురవ, ముప్పవరం షిరిడీ సాయి మందిరం, పర్చూరు, ఇంకొల్లులో లలితాత్రిపురసుందరిగా అమ్మవారు, చినగంజాంలో స్వామివారి గ్రామోత్సవం

ఏబీసీ వంతెన రెండో లేయర్ పనులు ప్రారంభం

మరో నెల రోజుల పాటు రాకపోకలు లేనట్లే

బల్లికురవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాపల్లి సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కాలువపై హైలెవల్ వంతెన పనులు రెండో లేయర్ కప్పు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. నెలరోజుల క్రితం వంతెనకు రెండున్నర అడుగుల ఎత్తులో మెదటి దశ కప్పు వేశారు. అప్పటి నుంచి బల్లికురవ అద్దంకి రోడ్డులో ఏబీసీ కాలువపై నుంచి వెళ్లే రాకపోకలు నిలిచి పోయాయి. మరలా రెండో లేయర్ కప్పు నాలుగు అంగుళాల మందంతో వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ లేయర్ కప్పు పూర్తి అయ్యాక మరో 20 రోజుల పైబడి క్యూరింగ్ చేయాల్సి ఉంది. దీంతో ఈ రోడ్డులో మరో నెల రోజుల వరకు రాక పోకలు లేనట్లే అని ప్రజలు అంటున్నారు. హైలెవల్ వంతెన పనులు శరవేగంగా చేపట్టిన కాలువలకు నీటి విడుదల వలన మెదట్లో 10 రోజుల పాటు పనులు మందుకు కదలలేదు. కాలువలో పిల్లర్లు వేసి మెదటి దశ కప్పు వేసి సాగుకు నీటిని దిగువకు విడుదల చేశారు. సాగు నీటికి ఇబ్బందులు లేకపోయిన రాక పోకలు లేక ప్రజలు మాత్రం కొంత ఇబ్బంది పడుతున్నారు. వల్లాపల్లి గ్రామానికి చెందిన రైతులకు కాలువ దక్షిణం వైపున పంట భూములు ఉండటం వారు పంటల సాగుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులను మంజూరు చేసింది.


రెండో లేయర్ కప్పు పనులు చేస్తున్న కూలీలు

చీరాల అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చ

- సీఎం చంద్రబాబును ఆకర్షించిన ఎమ్మెల్యే ప్రసంగం
- సభ దృష్టికి ఆర్‌వోబీ సహా పలు సమస్యలు
- కొండయ్యతో ప్రత్యేకంగా చర్చించిన సీఎం

చీరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కొండయ్య నియోజకవర్గ సమస్యలపై మాట్లాడటంతో వాటికి ముఖ్యమంత్రి చంద్రబాబును ఆ మాటలు ఆకర్షించాయి. దీంతో సమావేశం ముగింపు అనంతరం నేరుగా సిఎం ఛాంబర్‌కు ఎమ్మెల్యేను ప్రత్యేకంగా పలిపించి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే ఎమ్మెల్యే కూడా అసెంబ్లీ సమావేశాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక్కో రోజు ఒక్కో సమస్యను సభదృష్టికి తీసుకు వెళ్లి నియోజక అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు. మొదటి రోజు చీరాల ఆర్వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి), తరువాత రోజు కుందేరు అభివృద్ధిపై, తాజాగా రామాపురం, వాడరేవు తీర ప్రాంతాల అభివృద్ధిపై మాట్లాడారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వారంలో సుమారు 25 వేల మంది పలు ఇతర రాష్ట్రాల నుండి సైతం పర్యాటకులు వస్తున్నట్లు వివరించారు. అలాగే పిడుగురాళ్ల - వాడరేవు 167ఏ జాతీయ రహదారి నిర్మాణాలు వేగవంతంగా జరుగుతుండగా తద్వారా పర్యాటకులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అయితే వాడరేవు - సూర్యలంక కనెక్టివిటీ రోడ్డును పూర్తి చేయాలని సభలో కోరారు. అలాగే పొట్టిసుబ్బయ్యపాలెం డబుల్ రోడ్డు పెండింగ్ దశలో ఉందని చెప్పారు. అంతేకాకుండా పర్యాటకులకు మౌలిక వసతుల కల్పనకు దృష్టి సారిస్తే పర్యాటకం అభివృద్ధి చెంది, ఉపాధి, ఉద్యోగ అవకాశలు మెరుగుపడతాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన పర్యాటక మంత్రి దుర్గేష్ పర్యాటక అభివృద్ధిపై స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. చీరాలలో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి భరోసా కల్పించారు. అనంతరం ముఖ్యమంత్రి సైతం నేరుగా పిలిపించుకుని హ్యాండ్‌లూమ్ పార్క్, తదితర సమస్యలపై ఎమ్మెల్యే నుంచి ఆరా తీశారు. అభివృద్ధి పనులకు భరోసా కల్పించారు.


సీఎంకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

రైతులకు అండగా ప్రజా కూటమి ప్రభుత్వం

ఏపీఎస్‌డబ్ల్యూసీ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరావు

పర్చూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా ప్రజాకూటమి ప్రభుత్వం నిలిచిందని, అందుకు నిదర్శనంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం నల్లబర్లీ పొగాకును కొనుగోలుచేసి చరిత్రను సృష్టించిందని ఏపీ ఎస్‌డబ్ల్యూసీ కార్పోరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరావు అన్నారు. శనివారం స్థానిక గోడౌన్‌లో ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసిన పొగాకు నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ప్రైవేట్ కంపెనీలు కొనుగోలు చేయ లేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కొనుగోలుకు శ్రీకారం చుట్టిందన్నారు. దీనికి సంబంధించి రూ.276 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటి కొనుగోలు చేసిన రైతుల ఖతాల్లోకి రూ.100కోట్లను జమ చేశామన్నారు. పొగాకు రైతులతో పాటు, సరైన మద్దతు ధరలేక ఇబ్బంది పడుతున్న మామిడి, ఉల్లి, కొబ్బరి రైతులను కూడా ప్రభుత్వం ఆదుకుందన్నారు. జీఎం డి.మాధవ రావు, ఈఈ.జి.సురేంద్ర, ఆర్ఎం ఎండీ షాకీర్ హుస్సేన్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


నిల్వలను పరిశీలిస్తున్న చైర్మన్ రావి వెంకటేశ్వరావు

అభివృద్ధి సరే.. ముంపు సంగతేమిటి?

- జాతీయ రహదారి వెంబడి నీటి సరఫరాపై దృష్టిసారించని అధికారులు
- వరదనీటితో పైర్లు దెబ్బతింటాయంటున్న రైతులు



జాతీయ రహదారి వెంబడి పొలాల్లో నిలిచిన వర్షపునీరు, సర్వీసు రోడ్డు ఏర్పాటుతో కుంచించుకుపోయిన డ్రైనేజీ కాలువ

పర్చూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వాడరేడు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో అధికారుల మందుచూపు కొరవడంతో పంటపొలాలు, గ్రామాల సైతం మంపునకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా కాల్వల నిర్మాణంపై దృష్టి సారించకుండా రోడ్డు నిర్మాణం చేస్తూ చేతులు దులుపు కుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్చూరు సమీపంలో నాగులపాలెం ఎత్తిపోతల పథకం వద్ద అంచు వరకు సర్వీసు రోడ్డు నిర్మించారు. ఎగువ నీరు ఎటు పోవాలో అర్థంకానికి పరిస్థితి నెలకొంది. నూతన జాతీయ రహదారి పొడవునా ఒకటి రెండు చోట్ల తూములు వేసి చేతులు దులుపుకోవడం మినహా పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగేలా చేర్యలు చేపట్టిన దాఖలాలు కనపించడం లేదు. ఇటు డ్రైనేజ్, అటు జాతీయ రహదారుల సంస్థ అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. నిర్మాణ పనుల్లో తగు జాగ్రత్తలు తీసుకుంటే వరద ముంపు ఉండేది కాదని నిపుణులు అంటున్నారు. ఇప్పటికైనా డ్రైనేజ్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని యుద్ధ ప్రాతిపతికన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. పైచే రోడ్డు నిర్మాణంతో అభివృద్ధి మాట ఏమోకానీ, వరద నీరు పంట పొలాల్లోకి చేరి నిల్వ ఉంటే తమ భూములు చౌడుగా మారతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కారును వెనుక వైపు ఢీకొన్న లారీ

- ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అద్దంకి, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): కారును వెనుక వైపు లారీ ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కధనం మేరకు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దామచర్ల మండలం రాళ్లవాగు తండాకు చెందిన చినమస్తాన్, శ్రీధర్‌లు మరోవ్యక్తితో కలిసి శనివారం మధ్యాహ్నం ఒంగోలు వైపు వెళ్తుండగా అద్దంకి-శింగరకొండ మధ్య నామ్ రోడ్డులో వెనుక నుండి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ చినమస్తాన్, శ్రీధర్‌లను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని రాస్తారోకో

అద్దంకి, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం రాత్రి అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో బంధువులు రాస్తారోకో చేశారు. మండలంలోని తిమ్మాయపాలెంలో శనివారం ఉదయం ట్రాక్టర్ కింద పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందగా న్యాయం చేయాలని కోరుతూ బంధువులు శనివారం రా త్రి రాస్తోరోకో చేపట్టారు. రాత్రి 7-30 గంటలకు ప్రారంభమైన రాస్తారోకో పొద్దుపోయే వరకు కొనసాగింది. నామ్ రోడు లో ట్రాఫిక్ రెండు వైపులా నిలిచిపోయింది. డీఎస్పీ మొయిన్, సీఐ సుబ్బరాజులు బాధితులను సమన్వమ పరిచి రాస్తారోకో విరమింపజేశారు.

పూరీ - తిరుపతి రైలులో గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో ఇరువురు అనుమానితులు


చీరాల రైల్వేస్టేషన్‌లో పట్టుబడిన గంజాయి

చీరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తుండగా శనివారం పెద్దమొత్తంలో మొత్తం గంజాయి పట్టుబడింది. పూరీ - తిరుపతి రైలులో ఈగల్, జీఆర్‌పీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. 16 కిలోల గంజాయిని గుర్తించారు. అలాగే కేరళకు చెందిన ఇరువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇటీవల కాలంలో గంజాయి నిత్యం పట్టుబడుతుండడం గమనార్హం.

శ్మశానంలో ఇనుప గేట్లు మాయం

- పట్టించుకోని పంచాయతీ అధికారులు


శ్మశానవాటిక స్థలం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధేనువకొండ పునరావాస కాలనీ బలరామకృష్ణపురం శ్మశానంలో ఇనుప గేట్లు అపహరణకు గురయ్యాయయి. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు ప్రధాన ముంపు గ్రామమైన ధేనువకొండకు పునరావాసకాలనీ బలరామకృష్ణపురానికి మొదటిలో శ్మశానం లేదు. దీంతో చనిపోయిన వ్యక్తులను 35 కిలోమీటర్లు దూరంలో ఉన్న పాత ధేనువకొండ గ్రామానికి వాహనాలలో తీసుకువెళ్లి పూడ్చుకోవాల్సిన పరిస్థితి. దీనిపై స్పందించిన అప్పటి ప్రభుత్వం పునరావాసకాలనీ బలరామకృష్ణపురానికి సమీపంలో మూడు ఎకరాల భూమిని కొనుగోలు చేసి శ్మశానికి కేటాయించారు. అక్కడ ఎస్సీ, ఎస్టీలకు ఎకరం, బీసీలకు ఒక ఏ కరం, ఓసీ సామాజిక వర్గానికి ఒక ఎకరం చొప్పున మూడు సామాజిక వర్గాలకు శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. అయితే కొన్నినెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు శ్మశానం కంచెకు ఏర్పాటు చేసిన ఇనుప గేట్లను గుట్టుచప్పుడు కాకుండా దొంగిలించుకుపోయారు. ఆ విషయాన్ని అంటూ పంచాయతీ అధికారులు, కానీ ప్రజా ప్రతినిధులు కాని పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇటీవల మిగిలిన ఇనుప గేట్లును కూడా దొంగిలించుకుపోయ్యారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శ్మశానాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మాజీ ఎంపీపీ హనుమంతరావుకు ఘన నివాళి

ఇంకొల్లు,సెప్టెంబరు 27,(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ మద్దినేని హనుమంతరావు కు శనివారం పలువురు నివాళ్లులర్పించారు. ఇంకొల్లులో మద్దినేని హనుమంతరావు దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు.మద్దినేని హనుమంతరావు గతంలో పర్చూరు ఏఎంసీ చైర్మన్‌గా, ఇంకొల్లు మండల ఎంపీపీగా రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా పనిచేశారు. హనుమంతరావుకు పావులూరు ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు ఆత్మకూరి రాంబాబు, నాగిరెడ్డి,ఇంకొల్లు రోటరీక్లబ్ సభ్యులు,అడ్వకేట్లు,గ్రామ ప్రముఖులు,స్థానిక నాయకులు తదితరులు హాజరై నివాళ్లులర్పించారు.